ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 18, ఏప్రిల్ 2025

వరికి మద్దతు ధర మిథ్యగానే మారింది. అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా ఉన్నాయి. ఒకపక్క ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండగా మరోపక్క మిల్లర్లు, సివిల్ సప్లై అధికారులు కుమ్మక్కై దోపిడీకి తెర తీయడంతో రైతన్నకు రిక్తహస్తమే మిగులుతోంది. రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కల్లాలు చేస్తున్నారు. ధాన్యం నిల్వ చేసుకునే వీలులేక పొలాల్లో ఉంచితే వర్షం పడుతుందనే భయంతో ఎక్కువ మంది ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. తరుగు కింద నాలుగు కేజీలు అదనంగా తీస్తున్నా రైతులు ఏం చేయలేకపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విధిలేక వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు.





# మద్దతు మాయ!

## వర్షం బూచితో ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ | అన్నదాత పరిస్థితి అగమ్యగోచరం

- ధాన్యం బస్తా రూ.1,200కే కొనుగోలు
- తరుగు కింద అదనంగా 4 కేజీలు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు నామమాత్రం
- అక్కడా బస్తాకు పది కేజీలు డిమాండ్
- లబోదిబోమంటున్న రైతన్నలు

దర్శి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని సివిల్ సప్లై అధికారులు ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు కొన్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ఏ గ్రేడు రకం ధాన్యం 75 కేజీల బస్తాకు రూ.1,740.. సాధారణ రకం ధాన్యంకు రూ.1,725 మద్దతు ధర ప్రకటించింది. కేంద్రాల వద్దకు వెళ్లిన రైతులతో సిబ్బంది క్వింటాకు పది కేజీలు తరుగు కావాలని మిల్లరు అడుగుతున్నారని చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎక్కడ అమ్మినా ఒకటే అవుతుందనే ఉద్దేశంతో రైతులు వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందనే భయంతో పొలాల్లోనే ప్రైవేట్ మిగతా 6లో...

### గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రైవేట్ వ్యాపారుల దోపిడీతో అందరం తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు చేయటం లేదు. అక్కడకు వెళ్లిన రైతులకు అదనంగా పది కేజీలు ఇవ్వాలని మిల్లర్లు అడుగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితిని గుర్తించి మాకు న్యాయం చేయాలి.

-ఆకుల రాంబాబు, రైతు
చెరువుకొమ్ముపాలెం

# రెట్టింపు భరోసా

- మత్స్యకారులకు వేట విరామ భత్యం పెంపు
- రూ.10వేల నుంచి రూ.20 వేలకు..
- జిల్లాలో ఆరు వేల మందికి ప్రయోజనం
- 26న బ్యాంకు ఖాతాలకు జమకానున్న సొమ్ము

ఒంగోలు నగరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మత్స్యకారులకు వేట విరామం సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపు చేసింది. మూడు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేట విరామ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు రూ.10వేలు పరిహారం అందజేసేది. ఇప్పుడు దీన్ని ఒకేసారి రెట్టింపు చేసింది. రెండు నెలల పాటు వేట చేయకుండా ఉండే మత్స్యకార కుటుంబాలు ఇబ్బందులు పడకుండా వారిని ఆదుకునేందుకు ఈ పరిహారాన్ని సీఎం నారా చంద్రబాబునాయుడు రూ.20వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 15వతేదీ నుంచి జూన్ 14వతేదీ వరకు సముద్రంలో వేటను నిషేధించింది. ఈ సమయంలో సముద్ర జీవులు తన జాతిని ఉత్పత్తి చేసుకుంటాయి. ఆ నేపథ్యంలో దేశవ్యాప్తంగా చేపల వేటపై ఈ 61 రోజులు నిషేధం అమల్లో ఉంటుంది. వేటపైనే ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారులు ఈ రెండు నెలల పాటు జీవనానికి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఏటా పరిహారం అందజేస్తోంది. వైసీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో రూ.10వేల పరిహారాన్ని అందించేది. అయితే ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం దీన్ని రెట్టింపు చేసి రూ.20వేలు అందించనుంది. ఈనెల 26న ముఖ్యమంత్రి ఈ సొమ్మును మత్స్యకారుల ఖాతాలకు జమ మిగతా 6లో...





దర్శిలో గాలి వానకు విరిగిపడిన బొప్పాయి చెట్లు (ఫైల్)

## 514 హెక్టార్లలో నష్టం

- అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురిసిన అకాల వర్షానికి 514.30 హెక్టార్లలో పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని నాలుగు వ్యవసాయ డివిజన్ల పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 24 గ్రామాల్లో 583 మంది రైతులు అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయినట్లు గుర్తించారు. టంగుటూరు మండలంలో 11 గ్రామాలకు చెందిన 275 మంది రైతులు, సీఎస్‌పురం మండలంలో మూడు గ్రామాలకు చెందిన 65మంది రైతులు, వెలిగండ్ల మండలంలో ఒక గ్రామానికి చెందిన 12మంది రైతులు, బేస్తవారపేట మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 210 మంది, తాళ్లూరు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 21 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వరి 55.60 హెక్టార్లు, మొక్కజొన్న 202.70 హెక్టార్లు, అలసంద 10 హెక్టార్లు, శనగ 246 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను పంపారు.



మద్దిపాడు పెట్రోల్ బంకు వద్ద బర్లీ పొగాకు బేలును దహనం చేసి నిరసన తెలుపుతున్న రైతులు

## బర్లీ రైతు భగ్గు

- దక్కని గిట్టుబాటు ధర
- జాతీయ రహదారిపై పొగాకు బేళ్లు తగులబెట్టి నిరసన

మద్దిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర చెల్లించకుండా ప్రయివేట్ కంపెనీలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నాయని రైతులు గురువారం మద్దిపాడు పెట్రోల్ బంకు సమీపంలో ఆందోళనకు దిగారు. పీటీపీ పొగాకు కంపెనీ స్టాక్ పాయింట్ పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటు చేశారు. ఆ కంపెనీ వారు బర్లీ పొగాకును కొనుగోలు చేస్తుండటంతో గురువారం సంతమాగులూరు, రాజానగరం, వినుకొండ, నకరికల్లు, చేజర్ల రైతులు పొగాకును వాహనాలలో కంపెనీ స్టాకపాయింట్ వద్దకు తీసుకొచ్చారు. అయితే కంపెనీ వారు కిలో రూ.40 ధర చెప్పటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కనీసం రూ.80 నుంచి రూ.100 వరకు కొనుగోలు చేయాలని వేడుకోగా, బర్లీ పొగాకుకు పైనుంచి ఆర్డర్లు లేవని కిలో రూ.40 నుంచి రూ.50 మధ్యనే కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు తేల్చిచెప్పారు. దాదాపు 100 కిలోమీటర్ల నుంచి తీసుకొచ్చామని, గిట్టుబాటు ధర కల్పించకపోతే ఎట్లా అని రైతులు ఎంత బతిమాలినా వినకపోవడంతో చివరికి విసిగిపోయి ఆందోళనకు దిగారు. పక్కనే ఉన్న జాతీయ మిగతా 6లో...

# బోగస్‌లపై గురి!

- తొలగింపునకు ప్రభుత్వం చర్యలు
- సదరమ్ సర్టిఫికెట్‌ల రీవెరిఫికేషన్
- జీజీహెచ్‌లో కిక్కిరిసిన లబ్ధిదారులు

వైసీపీ పాలనలో అడ్డగోలుగా బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చేసి, దివ్యాంగ పింఛన్ పేరుతో ప్రజాధనాన్ని సొంత పార్టీ కార్యకర్తలకు దోచి పెట్టిన వ్యవహారంపై కదలిక మొదలైంది. ఆయా బోగస్ సదరం సర్టిఫికెట్‌లపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ మేరకు అర్హులైన పింఛన్‌దారులకు న్యాయం జరిగేలా, అనర్హుల తొలగింపునకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లాలో పింఛన్‌దారులైన దివ్యాంగుల సదరమ్ సర్టిఫికెట్‌ల రీ వెరిఫికేషన్‌కు ఆదేశించింది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులు తమ సర్టిఫికెట్‌లను మళ్లీ పరిశీలన చేయించుకునేందుకు వైద్యుల ఎదుట బారులు తీరుతున్నారు.

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ వారికి అర్హత లేకున్నా పింఛన్ లబ్ధి కల్పించాలనే ఉద్దేశంతో వైకల్యం లేకపోయినా, ఉందంటూ వైసీపీ పాలకులు ఇష్టారాజ్యంగా సదరమ్ సర్టిఫికెట్‌లు ఇచ్చారు. దీంతో అర్హులకు అన్యాయం జరగ్గా, అనర్హులు నెలనెలా వేల రూపాయల పింఛన్ సొమ్మును తినేశారు. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక బోగస్ సదరమ్ సర్టిఫికెట్‌ల మంజూరు వ్యవహారం బయటపడింది. ఆ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించడంతో సర్టిఫికెట్‌ల రీవెరిఫికేషన్ మొదలైంది. దీంతో అనర్హుల గుండెల్లో ఆందోళన నెలకొంది.

### జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గత కొద్దిరోజులుగా ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సదరమ్ సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ కార్యక్రమం నడుస్తోంది. చెవిటి, మూగ, అంధత్వం, ఎముకలు, కీళ్లు, మానసిక రోగులతోపాటు, మంచానికి పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ సర్టిఫికెట్‌ల కోసం వందలసంఖ్యలో జీజీహెచ్‌లో బారులు తీరుతున్నారు. ఒక్కో విభాగానికి రోజుకు 40 మందికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జీజీహెచ్ వైద్యులు సర్టిఫికెట్ మంజూరయ్యే నాటికి వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టిందా? లేక పెరిగిందా? అని పరీక్షలు చేసి నిర్ధారిస్తున్నారు. అవసరమైన వారికి ఆరోగ్య స్థితిని బట్టి సదరం సర్టిఫికెట్‌లో మార్పులు చేసి మంజూరు చేస్తున్నారు. వృద్ధులు, వికలాంగులు, అంధులు, మానసిక రోగుల్లో అత్యధిక శాతం మంది అర్హత అలాగే ఉండగా, అతి తక్కువలో షుగర్ వ్యాధిగ్రస్తులుగా చెప్పుకుంటూ డయాలసిస్ పేషెంట్‌లుగా మిగతా 6లో...



జీజీహెచ్‌లో సదరమ్ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు వచ్చిన లబ్ధిదారులు

# మేలో టీచర్ల బదిలీలు

- పారదర్శకంగా నిర్వహణకు ప్రభుత్వం చర్యలు
- దివ్యాంగులు, వ్యాధి పీడితులకు సర్టిఫికెట్లు
- 24 నుంచి 26 వరకు మెడికల్ బోర్డులు ఏర్పాటు

మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పారదర్శకంగా బదిలీలు నిర్వహించేందుకు టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-25 అమలులోకి తెచ్చిన రాష్ట్రప్రభుత్వం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. టీచర్ల బదిలీల్లో అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి పీడితులు, వారిపై ఆధారపడిన పిల్లలకు ముందుగానే అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయించేందుకు చర్యలు చేపట్టింది. అక్రమాలకు తావు లేకుండా కేవలం అర్హులైన వారికి మాత్రమే మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 24 నుంచి 26 వరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి బదిలీ కోసం దరఖాస్తు చేసుకొనే వారికి సర్టిఫికెట్లు జారీ చేయాలని పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, వైద్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఉమ్మడి జిల్లాలోని టీచర్లందరూ ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.



ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో మార్పులు చేశారు. గతంలో కేవలం 40 శాతం వైకల్యం ఉన్న వారిని కూడా ప్రాధాన్యత కేటగిరీలో చేర్చడంతో కుప్పలుతెప్పలుగా సర్టిఫికెట్లు తెచ్చి బదిలీల్లో లబ్ధిపొందారు. ప్రస్తుతం తీవ్ర వైకల్యం ఉన్న వారినే ప్రాధాన్యత కేటగిరీగా పరిగణించనున్నారు.

- 40శాతం నుంచి 55 శాతం శారీరక వైకల్యం, దృష్టిలోపం, వినికిడిలోపం ఉన్నవారికి బదిలీల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు.
- 56 నుంచి 69శాతం వరకు శారీరక వైకల్యం, వినికిడిలోపం, దృష్టిలోపం ఉన్నవారికి కూడా బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను కేటాయిస్తారు.
- 70 నుంచి 80శాతం వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీ టీచర్ల బదిలీల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. వీరికి వచ్చిన పాయింట్లతో సంబంధం లేకుండా వీరికి బదిలీల్లో స్థానాలు కోరుకునేందుకు ముందుగా అవకాశం ఇస్తారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు మిగతా 6లో...



ఎయిర్‌పోర్టు అథారిటీ బృందానికి భూముల మ్యాప్‌ను చూపుతున్న ఎమ్మెల్యే దామచర్ల (ఫైల్)

## ఎయిర్‌పోర్టుకు ఓకే..

- భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- నిధులు ఇచ్చేందుకు అంగీకారం
- 657.70 ఎకరాలకు రూ.115.78 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు

ఒంగోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు అవసరాన్ని ప్రాథమికంగా గుర్తించి ప్రతిపాదించిన 657.70 ఎకరాల భూసేకరణకు సూత్రప్రాయ అంగీకారం తెలియజేస్తూ రాష్ట్ర ఎయిర్‌పోర్టు అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందుకోసం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేస్తున్న కృషి, సీఎం చంద్రబాబునాయుడు దూరదృష్టితో సానుకూల సంకేతాలు అందాయి. నిజానికి ఒంగోలులో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెరపైకి రాగా భూముల పరిశీలన దశలోనే అప్పట్లో ఆగిపోయింది. అలా మరుగున పడిన ఎయిర్‌పోర్టు విషయం తిరిగి 2014 టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తెరపైకి వచ్చింది. అందుకు సంబంధించి కొంత పురోగతి వచ్చాక 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా విస్మరించింది. 2024లో కూటమి ప్రభుత్వం రాకతో సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో మౌలిక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టడంతో పాటు కేంద్రం మిగతా 6లో...

# తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మూడు నెలలు తాగునీటిని అందించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అవసరమైన మోటార్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే బాగు చేయించాలని చెప్పారు. అవసరమైతే స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా ఉన్న మంచినీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరం లేనిచోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో మాత్రమే నమోదు చేయాలన్నారు. అంతేకాని నోట్‌క్యామ్‌లో నమోదు చేస్తే అందుకు బాధ్యులైన అధికారులే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య ఉందని ప్రజలు కాల్‌సెంటర్‌కు లేదా అధికారులకు ఫోన్ చేసినపుడు దురుసుగా ప్రవర్తించినట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈ బాలశంకరరావు, పబ్లిక్‌హెల్త్ ఈఈ శ్రీనివాససంజయ్, మున్సిపల్ కమిషనర్లు, ఎస్ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెలలో మూడో శనివారం ఈ-చెక్ ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించబోతునట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లోను, ప్రజల వద్ద ఉన్న ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే విధానం, నిర్వహణపై అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 20న బీచ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బీచ్ కబడ్డీ క్రీడల మహిళల, పురుషుల క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 20వ తేదీన జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళల బీచ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు శింగరాయికొండ మండలం పాకల హైస్కూలులో మధ్యాహ్నం 2.30 గంటలకు పీడీ హజరత్ ఆధ్వర్యంలో జరుగుతాయి. వివరాలకు 9848606573 సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు. అదేవిధంగా పురుషులకు చిన్నగంజాం ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 3గంటలకు ఎంపికలు జరుగుతాయని, కోచ్ ఎం.గిరిబాబును 9700600996 సెల్‌నంబరులో సంప్రదించాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో మే 2వ తేదీ నుంచి జరిగే పోటీలలో పాల్గొంటారు.

## మెప్మా ఒంగోలు సీఎంఎం విధుల నుంచి తొలగింపు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
● ఉత్వర్వులు జారీ చేసిన పీడీ శ్రీధర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఒంగోలు సిటీ మిషన్ కల్పనను విధుల నుంచి తొలగించి, రాష్ట్ర మిషన్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో జరిగిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కాగా, ఈ కార్యక్రమానికి ఖర్చుల పేరుతో ఆర్పీల నుంచి రూ.400 చొప్పున వసూలు చేయడంపై సీఎంఎం అవినీతిని ఆంధ్రజ్యోతి 'సీఎం సభ పేరుతో వసూళ్ళు' కథనం ప్రచురించింది. దీనిపై మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలతో ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పట్టణ పొదుపు సంఘాల సమాఖ్య సంఘాలు 134 ఉండగా ఒక్కో సంఘం నుంచి రూ.1000 వసూలు చేశారు. సహకార శాఖకు ఒక సమాఖ్య నుంచి రూ.50 చెల్లించడం, మిగిలిన సొమ్ము కాజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కల్పనను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర మిషన్‌డైరెక్టర్‌కు సరెండర్ చేశారు.



చిన్నారితో తండ్రి, పోలీసు సిబ్బంది

## తప్పిపోయిన చిన్నారి

● తండ్రికి అప్పగించిన పోలీసులు

పెద్దదోర్నాల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన బధిర బాలుడు గురువారం ఉదయం ఇంటి నుంచి తప్పి పోయాడు. ఎంత వెదికినా కనిపించక పోవడంతో భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాధు చేశారు. స్పందించిన పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి ఆర్టీసీ బస్టాండు పరిసరాలలో సంచరించినట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి బాలుడిని గుర్తించారు. వెంటతీసుకుని వెళ్లి తల్లిదండ్రులకు అప్పజెప్పడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రెట్టింపు 'భరోసా'

(5వ పేజీ తరువాయి)

చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

### ఆరు వేల మందికి ప్రయోజనం...

రెట్టింపు చేసిన భరోసా సొమ్ము జిల్లాలోని ఆరు వేల మంది మత్స్యకారులకు అందనుంది. ఈనెల 18వతేదీన మత్స్యశాఖ అధికారులు లబ్ధిదారులను గుర్తించనున్నారు. వారి వివరాలను అధికారులు ప్రభుత్వానికి అప్‌లోడ్ చేస్తారు. వారి బ్యాంకు ఖాతాలలో లబ్ధిని జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఈనెల 26న ప్రారంభించనున్నారు. జిల్లాలో సముద్రంపై వేట సాగించే 1,300 పడవలు రిజిస్ట్రేషన్ చేశారు. ఇందులో 889 పడవల చేపల వేటపై నిషేధం అమలు కానుంది. ఈ పడవలు మోటార్లతో వేట సాగించేవి కాగా వీటి వేటపై నిషేధం అమల్లో ఉంటుంది. దీంతో ఈ బోట్ల ద్వారా వేట సాగించే మత్స్యకారుల జీవనం ఇబ్బందులలో పడనుంది. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం భృతిగా రూ.20వేలు వారి ఖాతాలకు జమ చేయనుంది. ఇంజిన్‌తో వేట సాగించే చిన్న పడవకు ముగ్గురు, ఒక మోస్తరు బోటుకు ఆరుగురు, పెద్ద బోట్లకు ఎనిమిది మంది మత్స్యకారులకు ఈ పరిహారం అందించనున్నారు. ఈ లెక్కన జిల్లాలోని ఆరు వేల మంది మత్స్యకారులు పరిహారం పొందేందుకు అర్హులని మత్స్యశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 18వ తేదీన మత్స్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో పరిశీలన చేసి లబ్ధిదారులను గుర్తించనున్నారు. 20వ తేదీలోగా వారి వివరాలను ప్రభుత్వానికి పంపించనున్నారు. ఇందుకోసం రెండురోజుల క్రితం ఉన్నతాధికారులు జిల్లా మత్స్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేశారు.



# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

● ఎస్పీ దామోదర్


ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్పీ, పోలీసులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి). పట్టణంలో పోలీసుల పటిష్ట నిఘా ఉంటుదని నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన కర్డెన్ సర్చ్‌ను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కోర్టు కూడలి, కంభం బస్టాండ్, గడియార స్తంభం కూడలిలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పట్టణ ప్రజలు జీవించేలా పోలీసులకు అండగా నిలవాలన్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నేరాల నియంత్రణ చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్ రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ, ఏకలవ్య కాలనీలతో పాటు పలు ప్రాంతాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానకూడలిలో సరైన పత్రాలు లేని వాహనాలను ఆపి పరిశీలించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ కే.నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయిఈశ్వర్, నాగరాజు, రమణ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

# నగరంలో దొంగలు హల్‌చల్

● బైక్‌లపై తిరుగుతూ దోపిడీలు
● పోలీసుల అదుపులో నలుగురు దుండగులు?

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో బైక్‌లపై రాత్రుళ్లు తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు దుండగులు. దారి కాచి దోపిడీలు చేస్తున్నారు. దీంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి 11గంటల మొదలు గురువారం తెల్లవారుజామున 4 గంటల వరకు నలుగురు దుండగులు బైక్‌లపై సంచరిస్తూ పలు ప్రాంతాలలో దారి దోపిడీలకు పాల్పడ్డారు. వీరిలో ఓ పాత నేరస్థుడు ఈ ముఠాకు నాయకత్వం వహించాడు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో, మార్కెట్ యార్డు ఎదురు, నెల్లూరు బస్టాండ్ ప్రాంతంలో ఈ నలుగురు బైక్‌లపై రాత్రి అంతా తిరుగుతూ కనిపించిన వారిని బెదిరించి వారి వద్ద సెల్‌ఫోన్లు, జేబుల్లో ఎంత నగదు ఉంటే అంత ఇచ్చే వరకు దాడులు చేశారు. అంతేకాకుండా స్థానిక మంగమ్మ కాలేజీ సమీపంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆలయ తలుపుల తాళాలు పగులగొట్టారు. హుండీని పగులగొట్టేందుకు విఫల యత్నం చేశారు. ఇలా నలుగురు దుండగులు తమ ఇష్టానుసారం రాత్రి అంతా నగరంలో హల్‌చల్ చేశారు. స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన నాగూరు అనే పాత నేరస్థుడు, మరో ముగ్గురు యువకులతో కలిసి ఈ దారి దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గురువారం ఉదయం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# తాగునీటి ఎద్దడిని నివారించాలి

● సమావేశంలో ఎంపీపీ మురళీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

కొనకనమిట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాలలో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో సాగర్‌నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. వారానికి ఒకసారి కూడా నీరు అందించడం లేదని అధికారులను నిలదీశారు. అంతేకాకుండా అధికారులు తాగునీటి సమస్యను తీర్చేవిధంగా చర్యలు తీసకొని సాగర్ నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులలో అవకతవకలు జరుగుతున్నాయని కూలీల వద్దనుండి ఫీల్డ్‌అసిస్టెంట్‌లు రూ.100 రూపాయలు వసూల్ చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ, పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్పందించిన ఏపీవో బులెన్‌రావు మాట్లాడుతూ ఫిర్యాదువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వ్యవసాయాధికారి ప్రసన్నరంగలక్ష్మి, వైద్యాధికారులు, పలువురు ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

● అపరాధ రుసుము విధింపు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఆరుగురుకి జైలు శిక్ష, అపరాధ రుసుము విధిస్తూ అద్దంకి అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగవెంకట లక్ష్మి గురువారం తీర్పు ఇచ్చారు. అద్దంకి మండలం మైలవరంలో 2020 సంవత్సరం ఆగస్టు 21వ తేదీన స్థలం వివాదంలో మన్నేపల్లి వెంకటేశ్వర్లును అదే గ్రామానికి చెందిన 7 గురు పథకం ప్రకారం మూకుమ్మడిగా దాడి చేసి, కొట్టి చంపడానికి ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేష్ కేసు నమోదు చేశారు. కేసు విచారణకు రాగా సీఐ సుబ్బరాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి కోర్టు కానిస్టేబుల్ రమణ ద్వారా సాక్షులు సక్రమంగా వాయిదాలకు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకున్నారు. అద్దంకి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరనారాయణ తగిన సాక్ష్యాధారాలతో నిందితులు నేరం చేసినట్లు నిరూపించడంతో కుడుములపల్లి కోటయ్యకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.12వేల అపరాధ రుసుము, కొండ నాగరాజుకు ఏడాది జైలు, రూ.7వేల అపరాధ రుసుము, మిగిలిన నలుగురు ఉడుములపల్లి సోమయ్య, కుడుములపల్లి పెద్ద కోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కొండ చిరంజీవికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.7వేల అపరాధ రుసుము విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగవెంకట లక్ష్మి తీర్పు చెప్పినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నిందితులకు శిక్ష పడే విధంగా తగిన చర్యలు తీసుకున్న సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

## 'మద్దతు' మాయ!

(5వ పేజీ తరువాయి)

వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

### ప్రైవేటు వ్యాపారుల దోపిడీ

ప్రైవేట్ వ్యాపారులు ధరలు కోసి అతి తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. వర్షాల బూచి చూపి 75 కేజీల బస్తాను కేవలం రూ.1,200కు మాత్రమే తీసుకుంటున్నారు. తేమ, తరుగు కింద మరో నాలుగు కేజీలు అదనంగా గుంజుతున్నారు. అంటే ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ వల్ల ధాన్యం రైతులు బస్తాకు రూ.400కుపైగా కోల్పోతున్నారన్న మాట. ఈ నేపథ్యంలో రైతులు ఏమి చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర కల్పించాలి



రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా సేకరించి గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. కేంద్రాల్లో కొనుగోలు జరగటం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో, వర్షాల వల్ల మరింత నష్టపోవాల్సి వస్తోందనే భయంతో తక్కువ ధరకు విక్రయిస్తున్నాం.

- నల్లబోతుల ఆంజనేయులు, రైతు చెరువు కొమ్ముపాలెం

### రైతులకు న్యాయం చేయాలి



ధాన్యం రైతులకు న్యాయం చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా విక్రయించుకోవాలో తెలియక అల్లాడుతున్నాం. ప్రైవేట్ వ్యాపారులు వర్షాన్ని బూచిగా చూపి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వెళితే పట్టించుకున్న నాథుడు లేడు. ధాన్యం ఇళ్లకు చేరుతుండటంతో ఏమి చేయాలో పాలుపోక అల్లాడుతున్నాం. రైతుల పరిస్థితిని గమనించి కేంద్రాల్లో కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలి.

- చాగం నాగేశ్వరరెడ్డి, రైతు, బొట్లపాలెం

# ఎయిర్‌పోర్టుకు ఓకే..

(5వ పేజీ తరువాయి)

ద్వారా గట్టిప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో ఒంగోలు ఎయిర్‌పోర్టు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యే అయిన తొలినాళ్లలోనే సీఎం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. మరోవైపు ఎంపీ మాగుంట కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్ళారు. ఈక్రమంలో గతేడాది ఆగస్టు 9న లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించి సభ దృష్టికి తీసుకెళ్లారు. సభలో కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా ఉన్న కె.రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆగస్టు 18న లోక్‌సభలో మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో ఏడు కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించి అందులో ఒంగోలు కూడా ఉన్నట్లు స్పష్టం చేశారు. దాంతో ఎయిర్‌పోర్టుపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఈక్రమంలో ఆగస్టు 22న ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించిన భూములు, వాటి ప్రస్తుత పరిస్థితిపై కలెక్టరేట్‌లో కీలక సమావేశం జరిగింది. ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జేసీ గోపాలకృష్ణలు ఈ సమావేశంలో పాల్గొని చర్చించారు. అనంతరం జిల్లా యంత్రాంగం భూముల పరిశీలన, ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 22న ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారుల బృందం ఒంగోలు వచ్చింది. ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, జిల్లా అధికారులతో కలిసి ప్రతిపాదిత భూములను సందర్శించారు. కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరుల పరిధిలో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించిన భూములను పరిశీలించారు. తదనంతరం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఎయిర్‌పోర్టుల పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా ఎయిర్‌పోర్టు అథారిటీతో తదుపరి చర్యలపై దృష్టిపెట్టింది. కాగా రాష్ట్రంలోని ప్రతిపాదిత కొత్త ఎయిర్‌పోర్టులు ఏడింటికి ప్రతిపాదించిన భూములపై ఆ సంస్థ పరిశీలనతోపాటు ఎయిర్‌పోర్టు అథారిటీ నివేదికల నేపథ్యంలో భూసేకరణ కోసం రాష్ట్రప్రభుత్వం రూ.1,570.64 కోట్లు మంజూరుకు ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరిస్తూ పరిపాలన ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఒంగోలు ఎయిర్‌పోర్టుకు గుర్తించిన 657.17 ఎకరాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ అందులో అవసరమైన భూసేకరణ కోసం రూ.115.78 కోట్లు మంజూరుచేసింది. ఎయిర్‌పోర్టు అథారిటీ మార్గదర్శకాలు, సూచనలకు లోబడి భూసేకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణం చేపట్టాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో ఏపీ ఎయిర్‌పోర్టు అభివృద్ధి సంస్థను ఆదేశించింది. కాగా భూసేకరణకు నిధులు మంజూరుతో ఒంగోలు ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై కీలక అడుగు పడిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తిచేయడంతో పాటు ఇతర అన్ని అనుమతులు పొంది త్వరలో నిర్మాణం ప్రారంభించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.


దైవాలరావూరులో రీ సర్వేను పరిశీలించి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

## రీసర్వేను వేగవంతం చేయండి

మేదరమెట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దైవాలరావూరులో జరుగుతున్న రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి ఆదేశించారు. గురువారం దైవాలరావూరు వచ్చిన ఆయన వీఆర్వోలు, సర్వేయర్లు, రీ-సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో రీ-సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 75శాతం సర్వే నంబర్లవారీగా విస్తీర్ణాలను రైతులు భాగస్వామ్యంతో పూర్తి చేశామని, మిగిలిన సర్వే నంబర్లలో సమస్యలుంటే రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ ఇక్కడే అందుబాటులో ఉంటారన్నారు. తప్పులు దొర్లకుండా డీఎల్ఆర్‌ను పూర్తి చేయాలన్నారు. వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను పొరపాట్లు దొర్లకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రీ-సర్వే డీటీ రవికాంత్, సర్వేయర్ మహేష్‌బాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వోలు నరసింహారావు, నారాయణ, మారుతి, సుధాకర్ పాల్గొన్నారు.

## పెళ్లింట విషాదం

● విద్యుదాఘాతానికి తండ్రి మృతి
● శోకసంద్రంలో కుటుంబం


చుక్కా శ్రీనివాసరావు(ఫైల్)

బోయినవారిపాలెం (చీరాల), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కుమారుడికి పెళ్లి కుదిరింది. అంతా ఘనంగా చేయాలంటూ ఎంతో ఉత్సాహంగా అందుకు సంబంధించి పనుల్లో నిమగ్నమైన తండ్రిని విధి వంచించింది. విద్యుదాఘాతానికి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన చుక్కా శ్రీనివాసరావు(52), లక్ష్మీ దంపతులు. వీరిది వ్యవసాయ కుటుంబం కాగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి గతంలోనే పెళ్లి అయింది. గత ఆదివారం గ్రామంలోనే రెండో కుమారుడి మహేష్‌కు పెద్దల సమక్షంలో సంబంధం కుదిరింది. వచ్చే నెలలో పెళ్లి నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కుమారుడి కోసం పూరింటికి గడ్డి కప్పుతుండగా ఇంటిపై ఉన్న విద్యుత్ తీగల జాయింట్ చేతికి తగిలి శ్రీనివాసరావు కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి మృతి చెందారు. దీంతో సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకున్న మృతదేహానికి గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## కిశోర బాలికలకు రక్తపరీక్షలు

బేస్తవారపేట, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం బేస్తవారపేట కస్తూర్బాగాంధీ పాఠశాలలో కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తనమూనాల సేకరించారు. కార్యక్రమంలో సీడీపీవో నీలోఫర్ బేగం పాల్గొని మాట్లాడుతూ అధికపోషక విలువలు ఉన్న మిల్లెట్లపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించి వాటిని వినియోగించడం కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయలక్ష్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం బాలికలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత అధిగమించడానికి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నెలసరిలో సమయంలో పాటించవలసిన పరిశుభ్రతా చర్యలు వివరించారు.

## మేలో టీచర్ల బదిలీలు

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత కేటగిరీలో స్థానం పొందేందుకు గతంలో కొందరు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు తెచ్చుకుని లబ్ధిపొందారు. ప్రస్తుతం ఆ అక్రమాలకు చెక్ పెట్టి అర్హులైన దివ్యాంగులకు మేలు జరిగేలా తీవ్ర వైకల్యం ఉన్న వారిని మాత్రమే ప్రాధాన్యత కేటగిరీలో స్థానం కల్పిస్తున్నారు.

- 80 శాతం అంతకంటే ఎక్కువ శారీక వైకల్యం, దృష్టిలోపం ఉన్నవారు
- 70 శాతం అంత కంటే ఎక్కువ శారీరక, దృష్టిలోపం ఉన్నవారు
- క్యాన్సర్, గుండె ఆపరేషన్, అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్నవారు
- స్పౌజ్ కాని, పిల్లలు కాని బుద్ధిమాంద్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నవారు
- తలసేమియా, హీమోఫిలియా, మస్క్యూలర్ డిస్ట్రోఫితో వైద్యం చేయించుకుంటున్న పిల్లలు ఉన్నవారు
- గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు ఉన్న టీచర్లను బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరిగా గుర్తిస్తారు.
- ప్రాధాన్యత కేటగిరిలో బదిలీ కోరుకునే టీచర్లు దీనికి సంబంధించిన సర్టిఫికెట్లు, గత మూడు సంవత్సరాలకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వీరందరూ ఈనెల 24 నుంచి 26 వరకు ఈ మూడు రోజుల్లోనే సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది. ఆర్‌జేడీలు, డీఈవోలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ మూడు రోజుల్లో సర్టిఫికెట్ల జారీకి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

## బోగస్‌లపై గురి!

(5వ పేజీ తరువాయి)

పింఛన్ పొందుతున్న వారు కొందరు ఉండటంతో వారి సర్టిఫికెట్‌ను రద్దుచేస్తున్నారు.

### బోగస్‌ల గుర్తింపునకే పరిశీలన

ఇదే విషయమై జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి దివ్యాంగుల పింఛన్‌దారులకు తేదీల వారీగా సచివాలయాల నుంచి నోటీసులు అందజేస్తారని వివరించారు. వారికి నిర్ణయించిన తేదీల్లో వచ్చిన వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన పింఛన్‌దారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రీవెరిఫికేషన్ పేరుతో తొలగిస్తారనే ఆందోళన వద్దని, బోగస్ సదరం సర్టిఫికెట్లను గుర్తించడానికి మాత్రమే పరిశీలన అని తెలిపారు.

## బర్లీ రైతు భగ్గు

(5వ పేజీ తరువాయి)

రహదారిపై బైటాయించారు. రోడ్డు పక్కనే బర్లీ పొగాకును తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంతమాగులూరు రైతు శ్రీనివాసరావు మాట్లాడుతూ కంపెనీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం అన్యాయమన్నారు. గత సంవత్సరం క్వింటా రూ.17వేలకు కొనుగోలు చేశారని ఈ ఏడాది కనీసం రూ.8 వేలు కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులు హైవేపై బైఠాయించడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. మద్దిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.



కార్పొరేట్‌కు దీటుగా రూపొందుతున్న దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల

కేంద్ర ప్రభుత్వ సహకారం, పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో ఓ ప్రభుత్వ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోంది. పీఎంశ్రీ (స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధికి అవసరమైన సామగ్రిని సమకూర్చుకుంది. విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆకర్షించింది. దీనికితోడు అక్షర జ్ఞానం అందించిన బడి అభివృద్ధికి కట్టుబడి పూర్వ విద్యార్థులు తలో చేయి వేసి మరింత తోడ్పాటు అందించడంతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలబడింది. ఒక పూర్వ విద్యార్థి వినూత్న ఆఫర్ ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల చూపు ఈ బడివైపు మళ్లింది. అంతేకాదు వచ్చే ఏడాది డైమండ్‌జూబ్లీని వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక రచిస్తున్న ఆ పాఠశాల మరేదో కాదు.. దొనకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఆ పాఠశాల ప్రత్యేకతలను తెలిపే కథనం మీకోసం...

# టాపర్‌కు టూర్ ప్యాకేజీ

● పదిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి విమాన ప్రయాణం

- విద్యార్థులను ప్రభుత్వ బడివైపు ఆకర్షించేలా ఓ పూర్వ విద్యార్థి వినూత్న ఆఫర్
- క్రీడల్లోనూ జాతీయస్థాయిలో గుర్తింపు
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎదుగుదల
- ప్రస్తుతం 1000 మంది విద్యార్థులతో కళకళ
- వచ్చే ఏడాది డైమండ్ జూబ్లీకి ప్రణాళికలు

● పీఎంశ్రీ నిధులు, పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి బాటలో దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల

● పదో తరగతి ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయస్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విమానం ఎక్కిస్తానంటూ పాఠశాల పూర్వ విద్యార్థి మాడిశెట్టి నాగేశ్వరరావు బంపర్ ఆఫర్ ప్రకటించారు. విమానంలో గన్నవరం నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లి హైదరాబాద్‌లోని అన్ని ప్రదేశాలు విద్యార్థులకు చూపించి తిరిగి హైదరాబాద్ నుంచి గన్నవరం వరకు విమాన ప్రయాణం చేయిస్తానని పూర్వ విద్యార్థి ప్రకటించినట్లు ఉపాధ్యాయ సిబ్బంది తెలిపారు.

● 1989-90 విద్యార్థులు పాఠశాలకు ఐరన్‌గేట్, పాఠశాల పేరుతో ఆర్చిని ఏర్పాటు చేశారు.

● 1980-81 విద్యార్థులు స్టేజీ ఏర్పాటు చేశారు.

● 1984-85 విద్యార్థులు బోరు, విద్యుత్ మోటారు ఏర్పాటు చేశారు.

● 1992-93 విద్యార్థులు రూ.2లక్షల ఖర్చుతో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశారు.

● సీసీ కెమెరాలు, లైబ్రరీ, ఇన్వర్టర్ తదితర వస్తువులు అందించి పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు

దొనకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయిలో వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో పాఠశాలల అభివృద్ధికి సంకల్పించింది. పీఎంశ్రీ పథకంలో మొదటి విడతగా దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల 2002లో ఎంపికైంది. అప్పట్లో 800 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 1000 మంది ఉన్నారు. 30 తరగతి గదులున్నాయి. 30 మంది ఉపాధ్యాయులున్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా ఏటా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది పది ఫలితాల్లో 173 మంది విద్యార్థులకు గాను 166 మంది ఉత్తర్ణత సాధించారు.

### పీఎంశ్రీ పథకం కింద జరుగుతున్న పనులివీ..

- పీఎంశ్రీ నిధులతో రూ.4.25 లక్షలు ఖర్చు చేసి ప్లేగ్రౌండ్ లెవలింగ్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్‌ల కోర్టుల ఏర్పాటు చేస్తున్నారు.
- కిచెన్‌గార్డెన్, దివ్యాంగ విద్యార్థులకు సౌకర్యవంతమైన ర్యాంపుల నిర్మాణం, వర్షపు నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంత తదితర పనులు సాగుతున్నాయి.

### క్రీడల్లో జాతీయ స్థాయి గుర్తింపు

పాఠశాలకు చెందిన విద్యార్థులను హెచ్‌ఎం సహకారంతో ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. బేస్‌బాల్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్ క్రీడల్లో ఏటా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ ఏడాది ఐదుగురు విద్యార్థులు నెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో ఎన్‌సీసీ ప్రారంభించి ప్రస్తుతం ఎన్‌సీసీలో వంద మంది విద్యార్థులు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.





పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్

● విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దోహదం

అటు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులు, ఇటు పూర్వ విద్యార్థులు ఆర్థికంగా, వస్తు రూపంలో అందిస్తున్న సంపూర్ణ సహకారంతో పాఠశాల కార్పొరేట్‌స్థాయిలో రూపొందుతోంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఈ అభివృద్ధి ఎంతో దోహదపడుతోంది. పాఠశాల ప్రారంభించి వచ్చే ఏడాదికి 75 సంవత్సరాలు అవుతున్నందున అందరి సంపూర్ణ సహకారంతో డైమండ్ జూబ్లీ వేడుకలు అట్టహాసంగా నిర్వహించాలనుకుంటున్నాం.



\- రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు

**పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు**

- పీఎంశ్రీ పాఠశాలల హెచ్‌ఎంలకు ఢిల్లీలో జరిగిన ఓరియంటేషన్ తరగతుల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి రీసోర్స్‌పర్సన్స్‌గా ఎంపికైన ఐదుగురు హెచ్‌ఎంలలో దొనకొండ హెచ్‌ఎం రామాంజనేయులు పాల్గొనటం విశేషం.
- ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దొనకొండల పాఠశాలకు చెందిన విద్యార్థి హర్షసాయి, ఉపాధ్యాయుడు చాంద్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

## పేద వారి సొంతింటి కలను నెరవేర్చాలి

### గృహ నిర్మాణ శాఖ సమీక్షలో కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పేదవారి సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో నిర్మాణాలను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మే ఆఖరు నాటికి 8,839 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 2,686 పూర్తయ్యాయన్నారు. ఇంకా 6,153 గృహాలు నిర్మించాల్సి ఉందని చెప్పారు. వేసవిలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన వాతావరణం ఉన్నందున సకాలంలో లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన వారికి అందించే అదనపు ఆర్థిక సహాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. రూఫ్ లెవల్‌లో 1695, రూఫ్ కాస్ట్‌లో 548 ఇళ్లు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

**శక్తియాప్‌పై అవగాహన కల్పించాలి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర(వాట్సాప్‌గవర్నెన్స్), శక్తి యాప్‌లపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర, శక్తియాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా యాప్‌లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకట నాయుడు, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మీ పాల్గొన్నారు.

**బంగారు బాల్యం ప్రాజెక్టు నోడల్ అధికారిగా గిరిధరశర్మ**

బంగారు బాల్యం ప్రాజెక్టు జిల్లా నోడల్ అధికారిగా రాచర్ల మండల విద్యాధికారి గిరిధర శర్మ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి అభినందించారు. వివిధశాఖల అధికారుల సమన్వయంతో బడిఈడు బాలలకు సంబంధించిన అంశాలైన బాల కార్మికులు, బాల్యవివాహాలు, బడిమానేసిన పిల్లల వివరాలు, పోషకాహార లోపం గల పిల్లలు, జననం, ఆధార్ సంబంధ సమస్యలు, పిల్లలు ఎదుర్కొంటున్న లైంగిక చర్యలు వంటివాటిపై ఆయన పనిచేయనున్నారు.

## ప్రశాంతంగా డైట్ రాతపరీక్ష

ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో బోధనా సిబ్బంది నియామకానికి ఆన్‌లైన్ పద్ధతిలో స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ట్యాబ్ ఆధారిత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రతి రెండు గంటలకు ఒకటి చొప్పున మొత్తం మూడు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులు, నిర్వాహకులు పలు సూచనలు చేశారు. జిల్లా స్థాయి పరిశీలకులు, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, రాష్ట్ర పరిశీలకులు రోజ్‌లాండ్, ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావులు కూడా పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఒంగోలు మండల విద్యాధికారి కిషోర్‌బాబు, చీమకుర్తి మండల విద్యాధికారి కె. శివాజీ పరీక్ష నిర్వహించారు. 19వ తేదీ రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

## తహసీల్దార్, వీఆర్వోలకు రిమాండ్

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ ఎం.సృజన్‌కుమార్, దొడ్డవరం వీఆర్వో అంకమ్మరావులకు నెల్లూరు ఏసీబీ కోర్టు 14రోజుల రిమాండ్ విధించింది. డెత్ సర్టిఫికెట్ కోసం రూ.90వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఏసీబీ అధికారులు వారిని అరెస్టు చేసి గురువారం రాత్రి నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.





చెన్నకేశస్వామి మూలవిరాట్

విద్యుత్ దీపాలంకరణలో చెన్నకేశవ ఆలయం



## నేటి నుంచి చెన్నయ్యకు ప్రత్యేక సేవలు

### మార్కాపురంలో వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు

### పగలు పలు వాహన సేవలు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీరాజ్యలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నుంచి వాహనసేవలను పగలు నిర్వహించనున్నారు. పొన్నవాహనం, హనుమంత వాహనం, గరుడు వాహనం, మోహిని ఉత్సవం, గజవాహన సేవ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే 21వ తేదీ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వాహనాల వెంబడి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులు నిత్యపూజలు అందుకుంటున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.



ఆలయ మధ్య రంగ మండపం

## పాత కేసులపై దృష్టి పెట్టండి

### ఎక్కువ నేరాలకు పాల్పడిన వారిపై పీడీ చట్టం

### సాంకేతికతను వినియోగించి దర్యాప్తు వేగవంతం

### నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాత కేసులపై దృష్టి పెట్టి దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ ఏఆర్. దామోదర్ ఆదేశించారు. గురువారం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాలులో నెల వారీ నేర సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ పాత కేసులు, ముఖ్యమైన కేసులను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. కేసుల పెండింగ్ తగ్గించాలని, అందుకు అన్ని స్థాయిల అధికారులు కృషి చేయాలని చెప్పారు. నేరాలు ఎక్కువ ఉన్న నేరస్థులపై పీడీ యాక్టు పెట్టాలని ఆదేశించారు. అంతేకాకుండా నిత్యం పాత నేరస్థులపై నిఘా పెట్టాలని కోరారు. వారు జైలు నుంచి రిలీజ్ అయింది మొదలు ప్రతి నిత్యం కదలికలపై పోలీసుల వద్ద సమాచారం ఉండాలన్నారు. వేసవిలో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉందని, అందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రులు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల పట్ల సత్వరమే పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. గ్రామాలను పోలీసులు సందర్శించి ప్రజలతో మంచి సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐజీ సమీక్ష**

నేర సమీక్ష సమావేశంలో ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ బాలరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను సమీక్ష చేశారు. నేరాలు ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో సాంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించి అనేక కేసుల దర్యాప్తులో ముందు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, డీయస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, రమణ కుమార్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.



హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

## 21నుంచి డీఈఎల్ఈడీ పరీక్షలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21నుంచి 26వ తేదీ వరకు మైనంపాడు డైట్‌లో జరుగుతాయని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. మొదటి సెమిస్టర్ రాత పరీక్షలు ఈనెల 21నుంచి ఒంగోలు ప్రభుత్వ బాలికోన్నతపాఠశాలలో మధ్యాహ్నం 2నుంచి 4.30 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొని హాజరు కావాలని ఆయన కోరారు.

## ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుస్తుగా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు గురువారం సీఎం చంద్రబాబునాయుడును కేంద్రమంత్రులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను చంద్రబాబు కట్ చేశారు. ఎంపీలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

## 24న మండల సమావేశం

నాగులుప్పలపాడు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 24వ తేదీ ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వై.మహాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

## 42 మంది రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 42మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇతర కళాశాలలకు చెందిన ఆరుగురు కూడా ఉద్యోగాలు సాధించారు. కియా కంపెనీకి చెందిన నిర్వాహకులు విద్యార్థులకు రాత పరీక్షలతో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2.60లక్షల వేతనం ఉంటుందని ప్లేస్‌మెంట్ అధికారి ఎస్‌వీ.రఘుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

## పశువులకు నీటితొట్టెలను నిర్మించాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(రూరల్), ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహం తీర్చటానికి ఉపాధి పథకం ద్వారా నీటితొట్టెలు నిర్మించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఎంపీడీవోలు, ఏపీవోలతో మాట్లాడారు. ఈనెల 22వ తేదీలోపు గ్రామాల్లో నీటితొట్టెలు నిర్మించాలన్నారు. వేసవిలో పశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఉపాధి పనుల లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడాపై ర్యాలీ

మద్దిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడాలో భాగంగా బూరేపల్లిలో గురువారం సీడీపీవో ఆర్.ఇవాంజెలిన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, జి.పద్మావతి, శివనాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్‌హాలులో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు నగర నూతన కమిటీ అధ్యక్షుడిగా పెళ్ళూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పెండెం వెంకటకృష్ణారావు, కోశాధికారిగా జానా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బట్టు బాలాజీ, పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డి.సింగయ్య, ఎస్‌కే.ఇమాంసా, గౌరవాధ్యక్షులు భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చీమకుర్తిలో కార్డెన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చీమకుర్తి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంతో పాటు మండలంలోని రెండు గ్రామాల్లో పోలీసులు గురువారం కార్డెన్ అండ్ సెర్చ్‌ను ఏకకాలంలో నిర్వహించారు. పట్టణంలోని గరికమిట్ట, మండలపరిధిలోని పులికొండ, మర్రిచెట్లపాలెం గ్రామాల్లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు పర్యవేక్షణలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దాదాపు 10కిపైగా డాక్యుమెంట్లు చూపని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమణారెడ్డి, ఎస్‌ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

ఒంగోలు(రూరల్), ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలు వేసవిలో ఉదయాన్నే పనులకు వెళ్లాలని, ప్రతి రోజు రూ.300 కూలి వస్తుందన్నారు. నీడ కోసం టెంట్ కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వెంకట్రావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ధ్యేయంగా పని చేయాలి

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్




మాట్లాడుతున్న మేనేజర్ విజయశేఖర్

సింగరాయకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ధ్యేయంగా కార్యక్రమాలను గ్రామాల్లో పటిష్ఠంగా చేపట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ అధికారులకు సూచించారు. మండలంలోని మూలగుంటపాడులోని చెత్తసంపద కేంద్రాన్ని ఆయనతోపాటు, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర టీం సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ శేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను తరలించడానికి గ్రామపంచాయతీలకు ట్రైసైకిళ్లు, ఆటోలు, ట్రాక్టర్లును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా కేటాయించామని తెలిపారు. వాటి ద్వారా గ్రామాల్లోని చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్తను మూడు రకాలుగా వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపునీటి సంరక్షణకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్లపెరట్లో చెత్త నిల్వలను శుభ్రపరిచి మొక్కలు, కూరగాయలు పెంపకం చేపట్టేటట్లు చూడాలని చెప్పారు. వ్యక్తిగత మురుగుదొడ్లు, ప్రధాన కూడళ్లలో, బీచ్ వంటి ప్రాంతాల్లో శానటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, ఒంగోలు డీఎల్పీవో పద్మ, ఎంపీడీవో జయమణి, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్, ఏపీఎం భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రాలు పాల్గొన్నారు.

# నగరంలో 'నక్ష' సర్వేకు ప్రత్యేక టీములు

● కమిషనర్ వెంకటేశ్వరరావు



డీడీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నేషనల్ జియో స్పేసియల్ నాలెడ్జ్ బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్ (నక్ష) సర్వే కోసం 14 ప్రత్యేక టీములను నియమించినట్లు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక వెంకగముక్కలపాలెంలో క్విస్ కాలేజీలో క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్, అడ్వాన్స్ సర్వే మెథాడాలజీ ద్వారా నగరంలోని సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతిపై ప్రతి ఇంటి ఖచ్చితత్వం కోసం లేటెస్ట్ టెక్నాలజీతో లీగల్ సమస్యలు రాకుండా సులభతరంగా భూ రికార్డులను ఆధునీకరిస్తామని తెలిపారు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్, ప్లానింగ్ సెక్రటరీలు, ఇతర సర్వే సిబ్బంది దీనిపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కాగా డీటీడీసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, జీఐఎస్ టీమ్ సభ్యులు ప్రవీణ్, వెంకటేశ్వర్లు శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ జెడ్.సుధాకర్, ఏసీపీ-2 శ్రీలక్ష్మి, టీపీవో బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి

● ఎమ్మెల్యే దామచర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ అయ్యేలా దృష్టి సారించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గురువారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో 19,20,22, 23 డివిజన్‌ల కుటుంబ సాధికార సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ డివిజన్‌లలో సమస్యలను తెలుసుకుని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే తన గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని చెప్పారు. పార్టీ బలోపేతం చేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని దామచర్ల కోరారు. నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. అందరు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

# నగరంలోని ఇళ్లకు డోర్ నెంబర్లు

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ప్రతి ఇంటికి డోర్ నెంబర్లు వేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా సరిచేయడంతో పాటు 18 ఏళ్ళునిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లు ఉంటే తొలగిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తామని, తెలిపారు. కాగా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను ఆర్డీవో దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో కృష్ణారావు, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంకట్రావు, ఎస్‌కే.రసూల్, డీఎస్.క్రాంతికుమార్, రమేష్, రాయపాటి అజయ్‌కుమార్, గుర్రం సత్యం, వెంకటస్వామి పాల్గొన్నారు.

# ప్రజలపై యుద్ధం చేసే హక్కు ప్రభుత్వాలకు లేదు

● విరసం నేత కల్యాణరావు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య దేశంలో ప్రజలపై యుద్ధం చేసే హక్కు ప్రభుత్వాలకు లేదని విరసం సీనియర్ నేత జి.కల్యాణ్‌రావు పేర్కొన్నారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ్‌రావు మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై దాడులు నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఆదివాసీలకు కనీస సౌకర్యాలైన విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాలు కల్పించని దుస్థితి నెలకొందని చెప్పారు. అటవీ చట్టాలను ఉల్లంఘించడం, విస్తారమైన రోడ్ల నిర్మాణాలు చేస్తూ అడువుల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలు తరలించుకోవడానికి విధ్వంసం చేస్తున్నారన్నారు. అందువల్లనే ఆదివాసీలు తమ ప్రాణాలను తెగించి పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, పలు సంఘాల నాయకులు చావలి సుధాకర్, చుండూరి రంగారావు, కృష్ణ, కోటి, వై.వెంకటేశ్వరరావు, ఎంకే.బేగ్, కె.రాజారావు, వెంకటరెడ్డి, కారుమంచి విజయకుమార్, గోపిశ్రీనివాసులు, అబ్దుల్‌సత్తార్, పి.ఖాజావలి, అహ్మద్, నరసింహారావు, మల్లికార్జున, లింగయ్య, బి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి

● అగ్నిమాపకశాఖ అధికారి వెంకటరావు



శాంతినికేతన్ స్కూల్‌లో అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది

కొండపి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా స్కూళ్ల యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొండపి అగ్నిమాపక కేంద్రం అధికారి సిహెచ్ వెంకటరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కొండపిలోని శాంతి నికేతన్, హ్యాపీకిడ్స్ స్కూళ్లలోని విద్యార్థులకు అగ్నిప్రమాదాలు ఏ విధంగా జరుగుతాయి? నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ప్రత్యక్షంగా అగ్నిప్రమాదాలను, నివారణ చర్యలను విద్యార్థులకు, స్కూల్ సిబ్బందికి చూపించారు. కార్యక్రమంలో శాంతి నికేతన్ స్కూల్ కరస్పాండెంట్ హరనాథ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్): అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. గురువారం ఒంగోలులోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో అగ్నిమాపకశాఖ అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సహాయ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## 75 శాతం సబ్సిడీతో జొన్న విత్తనాలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం కోసం 75 శాతం సబ్సిడీతో గడ్డి జొన్నవిత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు డీఏహెచ్‌వో కె.బేబీరాణి తెలిపారు. గురువారం మండలంలోని పోతవరం, బి.నిడమానూరు గ్రామాల్లో గురువారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ వేసవిలో పశువులకు తాగునీరు అందించేందుకు ఉపాధి పథకం ద్వారా నీటితొట్టెలు నిర్మిస్తామని చెప్పారు. గొర్రెలు, మేకల పోషకులు తప్పక టీకాలు వేయించాలన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పెరిగిన వేతనం



ఏడుగుండ్లపాడులో పనులు చేస్తున్న కూలీలు

మద్దిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు వేతనం పెంచుతూ ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రోజువారీ కూలి రూ.300 నుంచి రూ.307కు పెంచారు. ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు ఏపీడీ వెంకటస్వామి గురువారం తెలిపారు. కాగా మద్దిపాడు మండలంలోని పంచాయతీల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మే నెల ఆరంభంలో మరో 20 శాతం మంది కూలీలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జంగిల్ క్లియరెన్స్, ఇంకుడు గుంతలు, కందకాలు తీయడం, పొలాలకు వెళ్లే దారులు చదును చేయడం తదితర పనులు ఉన్నాయి. 150 రోజుల పనిదినాలు కల్పించేందుకు మండల ఏపీవో ధనుంజయవర్మ ప్రణాళికలను తయారు చేస్తున్నారు. జాబ్‌కార్డ్ ఉన్న ప్రతి కూలీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మహిళకు గాయాలు

మద్దిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలో స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. ఒంగోలు నగరం రాజాపానగల్ రోడ్డుకు చెందిన పి.రమాదేవి గురువారం తన స్కూటీపై ముప్పవరం గ్రామంలో బంధువుల కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుండ్లాపల్లి వద్ద లారీ అడ్డురావటంతో స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో గాయపడిన రమాదేవిని స్థానికులు కారులో కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

## పొగాకు వేలం తీరు పరిశీలన



మాట్లాడుతున్న సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంటలోని పొగాకు వేలం కేంద్రం-2ను గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న వేలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులు మాట్లాడుతూ గత ఏడాది కిలో పొగాకు రూ.300 ఉంటే ఈ ఏడాది రూ.280 ధర మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటసాగుకు భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. అనంతరం సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్యలను ప్రజాప్రతినిధులు, బోర్డు చైర్మన్, కేంద్ర నాయకుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొగాకు వేలం కేంద్రం వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు పోద వరప్రసాద్, బీజేపీ నాయకులు పీవీ.శివారెడ్డి, శివాజీ, పి.సుబ్బారావు, రాయపాటి అజయ్, దండు శ్రీనివాసరావు, అమరసింహ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో జిల్లాల్లో ఎక్కడా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో చినఓబులేశు, అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, వరలక్ష్మి, వెంకటనాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా రియాజ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ జన్మదిన వేడుకలు గురువారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. 27వ డివిజన్‌లో బొందిల శ్రీదేవి, మధు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వాసకి నాయుడు, మహేష్, నానిల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సుంకర కళ్యాణి నేతృత్వంలో సమతా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ, అలాగే పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష ఆధ్వర్యంలో బొమ్మరిల్లులో కేక్ కట్ చేశారు. పలు డివిజన్లలో ఆ పార్టీ నాయకులు రియాజ్ పుట్టినరోజు వేడుకలను జరిపారు. ఆయా కార్యక్రమాల్లో చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, పల్లి రాజేష్, గోవింద్ కోమలి, ఆలా నారాయన, నరసింహారావు, ముంతాజ్, బ్రహ్మనాయుడు, అంకబాబు, సాంబయ్య, అనూష, అనంతలక్ష్మి, ఆనంద్‌నాయుడు పాల్గొన్నారు.

## పూర్తి సర్వీసు పాయింట్లు ఇవ్వాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు రానున్న బదిలీల్లో మొత్తం సర్వీసుకు పాయింట్లు కేటాయించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో 300మంది ఎయిడెడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లో విలీనమయ్యారని, వారికి కేవలం మూడు సంవత్సరాలకే స్టేషన్ పాయింట్లు వస్తాయని, వీరికి పూర్తి సర్వీసుకు పాయింట్లను కేటాయించకపోతే బదిలీల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పూర్తి సర్వీసు పాయింట్లు కేటాయించి ఆదుకోవాలని వారు కోరారు.

## రేపటి వరకు అభ్యంతరాల స్వీకరణ : డీఈవో

ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతుల ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరణ గడువు ఈనెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని ఆయన ఆయన స్పష్టం చేశారు.

## పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఐటీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఫ్యూచర్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బెంగళూరు ఏఎస్‌ఎం టెక్నాలజీస్ ప్రొడక్ట్ ఇంజనీర్ ఎం.ప్రతాప్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా విజేష్‌రాజ్

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా పాలపర్తి విజేష్‌రాజ్‌ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం సంతనూతలపాడు నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న విజేష్‌రాజ్‌ను జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన షర్మిలారెడ్డి, జిల్లా అధ్యక్షుడు షేక్ సైదాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని వాపోయారు. 2023లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ 23శాతం వేతన సవరణ ఇచ్చినప్పటికి సీహెచ్‌వోలు గా పనిచేస్తున్న తమకు ఇంతవరకు వేతన సవరణ చేయలదేని, ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.హరిణికి వినతిపత్రం అందజేశారు.

## అవి.. ఇవి

### వెదురు సాగుపై అవగాహన


ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డేవిడ్

గిద్దలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండల సమాఖ్య కార్యాలయంలో వెదురు సాగుపై వీవోలకు శిక్షణ ఇచ్చారు. ఇండస్ట్రీ ఫౌండేషన్, సెర్ప్ సంస్థ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వెలుగు డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ పి.డేవిడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వెయ్యి మంది మహిళ రైతులను గుర్తించి వారి ద్వారా వెదురును సాగు చేయించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు బోరు సౌకర్యం ఉంటే 30 సెంట్ల విస్తీర్ణంలో ప్రతి మహిళ రైతుకు 60 వెదురు మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. వెదురు సాగు మార్కెటింగ్ సౌకర్యం, తద్వారా వచ్చే ఆర్థిక లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్లు కుసుమకుమారి, శ్రీనివాసరెడ్డి, ఏపీఎం నారాయణరావు, ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, వివిధ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో నిరసన


డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ రీజనల్ నాయకులు నాగిరెడ్డి, టీఎంకే రావులు మాట్లాడుతూ.. పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలని 1-19 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్ పెంచాలని, సిక్ కాలానికి పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానం పునరుద్ధరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆగిపోయిన ఉద్యోగోన్నతులు వెంటనే ఇవ్వాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సులలో ఉచిత ప్రయాణానికి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.కాశయ్య, అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసులు, గ్యారుజీ అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, డీఎస్ఎన్ రెడ్డి, హనీఫ్, ముత్తయ్య, రవి, శివారెడ్డి పాల్గొన్నారు.

### శివారు ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్


పలుశివారు ప్రాంతాల్లో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పొదిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గురువారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలైన పిచిరెడ్డి తోట, మార్కాపురం అడ్డరోడ్డు, దర్శిరోడ్డు, కాటూరివారిపాలెం, రైల్వేట్రాక్‌ల వద్ద ఒంగోలు స్పెషల్ బ్యాచ్ పోలీసులతో ఆయా ప్రాంతాలు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో, పట్టణంలో ఎవరైన కొత్తవ్యక్తులు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ వేమన, సిబ్బంది పాల్గొన్నారు.

### చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాటినుంజల కోసమై చెట్టు ఎక్కి అక్కడి నుండి కిందపడి వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన గురువారం జరిగింది. మండలంలోని దిగువమెట్ట గ్రామానికి చెందిన సిరివెళ్ల రామచంద్రుడు కూలీ పని చేసుకుని, భార్య, ఇరువురు పిల్లలను పోషిస్తున్నాడు. గురువారం తాటిముంజల కోసం చెట్టు ఎక్కి కొడుతుండగా ప్రమాదవశాత్తు పైనుండి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

### పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

● ఎంఈవో-2 శ్రీనివాసులు

కంభం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల వసతులు, సౌకర్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కందులాపురం యూపీ పాఠశాలల పునఃవ్యవస్థీకరణలో భాగంగా హైస్కూలుగా మార్పుచెందడం గ్రామస్థులకు వరమని తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్‌యార్డు

- మూడు దశాబ్దాల క్రితం నిర్మాణం
- నేటికీ వినియోగంలోని రాని దైన్యం
- శిథిలావస్థకు భవనాలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రెండు మండలాల రైతుల ప్రయోజనం కోసం నిర్మించిన వ్యవసాయ మార్కెట్‌యార్డు వినియోగంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరింది. లక్షల రూపాయలు విలువైన స్థలాన్ని సేకరించడమే కాకుండా భవనాలు నిర్మించింది. కాని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, ప్రజాధనం వృథా అయ్యింది.

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రైతులకు అందుబాటులో 16 ఎకరాలలో వ్యవసాయ మార్కెట్ నిర్వహణ కోసం 3 దశాబ్ధాల క్రితం షెడ్డు, శీతల గిడ్డంగులు కోసం 2 భవనాలు, కార్యాలయం నిర్మించింది. వీటి నిర్వహణను వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో భాగం చేశారు. పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఉద్యోగిని కూడా నియమించారు. మండలం నుండి బయట ప్రాంతాలకు తరలివెళ్లే ధాన్యం, పంటలను కూడా పరిశీలిస్తున్నారు. అయితే యార్డు అలనాపాలనా కరువైంది. ఇంతవరకు సంబంధిత అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఆవరణంతా చిల్ల కంపతో అల్లుకుపోయి అస్తవ్యస్తంగా తయారైంది. ప్రహరీ గోడలు కూలిపోతున్నాయి. ఇనుప గేట్లు తుక్కుపట్టి పోతున్నాయి. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది. అప్పుడప్పుడు కొందరు కొంత స్థలాన్ని బాగు చేసుకుని క్రీడా పోటీల నిర్వహణ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ చేపడుతున్నారు. ఇప్పటికే కొంత భాగాన్ని ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయం, వైద్య ఉప కేంద్రం, రైతుభరోసా కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మిగిలిన స్థలం మాత్రం నిరుపయోగంగానే ఉంది.

**రైతులకు వినియోగించాలి**

రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డును ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలో ప్రధానంగా మిర్చి, పత్తి, ఆముదం, కందులు, అలసందలు, మినుములు, శనగలు పండిస్తుంటారు. గిట్టుబాటు ధర లేక గుంటూరు, ఆదోని, చెన్నై వంటి ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వ్యయప్రయాసలు అధికమయి పలు ఇక్కట్లకు గురవుతున్నారు. స్థానికంగా శీతల గిడ్డంగులు ఉన్నట్లయితే పంటను ఇక్కడే నిల్వ చేసుకుని ఆ పంటపై రుణం తీసుకునే వెసులుబాటు ఉంటుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్ కూడా ఇక్కడే నిర్వహిస్తే రవాణా ఖర్చు కలిసి వస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటయ్యే మార్కెట్టు యార్డు కమిటి సభ్యులు యార్డు నిర్వహణపై దృష్టి పెట్టాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న యార్డు భవనాలు

# అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఎర్రగొండపాలెం అగ్నిమాపకకేంద్ర అధికారి డి.మాల్యాద్రి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమా హాల్ సమీపంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించారు. అలాగే సినిమాహాల్‌లో ప్రమాదాలు జరిగితే ఆ ప్రాంతంలో ఉండే సీవో-2 వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ ఎఫ్ సిహెచ్ కాశివిశ్వనాథం, వి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ.రవి, బాబు, డీవోపీజీ రవి, ఎఫ్‌ఎం పి.కృష్ణనాయక్, వి.పూర్ణచంద్రారెడ్డి, ఎం తార్యానాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

తర్లుపాడు : అగ్నిప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మార్కాపురం అగ్నిమాపకశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గృహాల్లో జరిగే గ్యాస్‌లీక్ ప్రమాదాల నివారణ ప్రయోగాత్మకంగా వివరించారు. విద్యార్థులు ఈతకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. అపార్ట్‌మెంట్‌లలో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా నివారించాలో వివరించారు. రెగ్యులేటర్ వద్ద ఆఫ్ చేయడానికి వీలు లేకుండా మంటలు వ్యాపిస్తే ఇంట్లో అందుబాటులో ఉన్న గోధుమ, వరిపిండి చల్లి, లేదా తడి గోనె సంచి, తడి దుప్పటి కప్పి మంటలను అదుపు చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఎం.సుధాకర్‌బాబు, తర్లుపాడు లోని పలు పాఠశాల ప్రధానోపాధ్యాయలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పొగాకు బోర్డును పరిశీలించి వేలంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న పొగాకు ధరలు, దిగుబడుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది కంటే పెట్టుబడులు, కూలీలు అధికంగా పెరిగాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంతే కాకుండా దిగుబడి అనుకూలంగా ఉన్నా ధరలు అనుకూలంగా లేవన్నారు. అన్నదాతలు ఇబ్బందులు పడుతుంటే మనకు మంచిదికాదన్నారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చొరవ తీసుకొని పొగాకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఆశించిన ధరలు లేక అన్నదాతలు అల్లాడుతున్నారని గిట్టుబాటు ధర వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను కాపాడాలని కోరారు.


పొగాకు వేలం తీరును పరిశీలిస్తున్న అన్నా రాంబాబు

# ఘనంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు గురువారం ఉదయం మోహిని ఉత్సవ వేడుకలను ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ఘనంగా నిర్వహించారు. రాత్రికి గజోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు ఆర్.రామచంద్రమూర్తి, నలగాటి వెంకటేశ్వర్లు, నలగాటి చెన్నవీరయ్య, నలగాటి తిమ్మనాయుడు, నలగాటి రత్తమ్మ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**ఎల్లమ్మ కొలుపులు ప్రారంభం**

పెద్దదోర్నాల, ఏప్రిల్ 17: మండలంలోని యడవల్లి గ్రామంలో నాగారపు ఎల్లమ్మ తల్లి కొలుపులు దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమయ్యాయి. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు కాకర్ల శ్రీనివాసులు, లక్ష్మీప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో వేదపండితులు గణపతి పూజ, పుణ్యావచనం, కలశపూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు.


యడవల్లిలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**20 నుంచి బ్రహ్మోత్సవాలు**

గిద్దలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలం కెఎస్‌పల్లెలో వెలసిన శ్రీపోలేరమ్మ దేవాలయంలో 20 నుంచి 22వ తేదీ వరకు 6వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అంబటి బాలిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20న ఆదివారం సుప్రభాత సేవ, అభిషేకం, సాయంత్రం కుంకుమార్చన, కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన, పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమాలు, 21న హోమాలు, సాయంత్రం గ్రామోత్సవం, 22న అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందన్నారు. ఈ మూడు రోజుల పాటు భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


విశేష అలంకరణలో చెన్నకేశవుడు

**ఎడ్లబలప్రదర్శన పోటీల ఏర్పాటు**

పోలేరమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 20వ తేది ఆదివారం కెఎస్.పల్లెలో రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు సీనియర్స్ విభాగంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అంబటి బాలిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా బహుమతులు రూ.1లక్ష, 80వేలు, 60వేలు, 40వేలు, 30వేలు, 20వేలు, 10వేలు, కన్సోలేషన్ బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9052882203, 8185041681 సంప్రదించాలన్నారు.

### ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

గిద్దలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమం, అనాథ పిల్లల శరణాలయంలో ఉన్నవారు ఆహారం తినేందుకు వీలుగా యువ ప్రగతిపథం స్వచ్ఛంద సంస్థ ప్లేట్లు, గ్లాసులను అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పి.వేణుగోపాల్, సభ్యులు రత్నం, సిద్ధయ్య, ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి

పెద్దారవీడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్‌జారీ చేసిన ప్రభుత్వం గవర్నర్ సంతకంతో ఆమోదముద్ర పడిందన్నారు. ఎస్సీల ఏబీసీడీల వర్గీకరణకు 1997లోనే టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. ఈ ప్రకటన జారీ చేసిన వారిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు జడ్డా రవి, బి.దానం తదితరులున్నారు.

### అమ్మకు వందనం


తల్లులను పూజిస్తున్న పిల్లలు

గిద్దలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ విద్యాసంస్థలో అమ్మకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మ గొప్పతనం గురించి పలువురు వివరించారు. ఈ సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తల్లులకు వారి పిల్లలు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదాన్ని పొందారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల క్లస్టర్ ప్రిన్సిపాల్ సునిత, ప్రిన్సిపాల్ రాముడు, వైస్ ప్రిన్సిపాల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### డెంగ్యూతో మాజీ సర్పంచ్ మృతి

పొదిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు గ్రామంలో డెంగ్యూ లక్షణాలతో మాజీ సర్పంచ్ ధర్మవరపు సుబ్బారావు(68) మృతి చెందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతి విషయం తెలుసుకున్న వైద్యసిబ్బంది వైద్యాధికారులు గురువారం గ్రామంలో పర్యటించారు. జిల్లా మలేరియ అధికారి మాధుసూధనరావు మృతికి గల కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, ఫ్రైడేఫ్రైడే, వెక్టార్ కంట్రోల్, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కుమారి

గిద్దలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన పగడాల వెంకటకుమారి నియమితులయ్యారు. గతంలో కూడా పగడాల వెంకటకుమారి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. తాజాగా జిల్లాశాఖ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమె భర్త పగడాల రంగస్వామి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న విషయం విధితమే. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ మరింత బలోపేతానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా వెంకటకుమారి తెలిపారు.


వెంకటకుమారి

### 20న ఉచిత కంటి వైద్యశిబిరం

బేస్తవారపేట, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట చేయూత మిత్రమండలి ఆధ్వర్యంలోఈ నెల 20న మధ్యాహ్నం 2గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. బేస్తవారపేట నుండి దర్గ కొండవెళ్లే రహదారిలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుంటూరు పెద్దకాకానికి చెందిన శంకర్ కంటి వైద్యశాల నుండి వైద్యబృందం వస్తుందన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైతే ఉచితంగా చేయనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 9059792940, 9866537245 నంబర్లను సంప్రదించాలన్నారు.

### రాజీమార్గమే రాజమార్గం

● లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని, ఆ దిశగా న్యాయవాదులంతా కృషిచేసి వచ్చే లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ అన్నారు. గురువారం స్థానిక కోర్టు భవనాల ఆవరణలో గిద్దలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో ఆయన సమీక్ష నిర్వహించారు. న్యాయాధికారులు ఓంకార్, మేరీసారాదానమ్మ మాట్లాడుతూ మే 10న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవడానికి రాజీమార్గం ఉత్తమమని తెలిపారు. ఇరుపార్టీలకు ఆమోదయోగ్యమైన షరతులు పొందుపరచడం ద్వారా ఇరుపార్టీలు గెలిచినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేషశైనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్‌షరీఫ్, ట్రెజర న్యాయవాదులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న న్యాయాధికారులు

### బెల్టు షాపు వివాదం.. 28 మందిపై కేసు నమోదు

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 17( ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మిట్టపాలెం గ్రామంలో బుధవారం రాత్రి బెల్టుషాపు నిర్వాహణపై టీడీపీ వర్గీయులు ఒకరిపై, ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఇరువర్గీయులపై కేసులు నమోదు చేసినట్లు త్రిపురాంతకం ఎస్.ఐ బసవరాజు గురువారం తెలిపారు. పూట్ల మాధవి ఫిర్యాదు మేరకు శాఖమూరి వెంకటనారాయణ మరో 13 మంది పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శాఖమూరి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు ఎలమర్తి శ్రీనివాసరావు మరో 13 మంది పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఒక్కొక్క వర్గంలో 14 మందిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్ఐ బసవరాజు తెలిపారు.

### ఎక్సైజ్ కార్యాలయంలో కమిషనర్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ హేమంత్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలుసూచనలు చేశారు. నాటుసారా నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రారంభించిన నవోదయ-2 కార్యక్రమం తీరుతెన్నుల గురించి సమీక్ష నిర్వహించారు. గిద్దలూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఐదు గ్రామాలలో నాటుసారా తయారీ, అమ్మకాలు ఉన్నాయని, గ్రామ,మండల కమిటీల సహకారంతో సారా నిర్మూలన కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రెవెన్యూ, పోలీసుశాఖల సహకారం తీసుకుంటున్నామని, నల్లబెల్లం అమ్మకాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య, గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు, ఎస్సై రాజారెడ్డి ఉన్నారు.

**కంభం ఎక్సైజ్ కార్యాలయంలో..**

కంభం : కంభం ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఒంగోలు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు, మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్యతో కలిసి కంభం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాటుసారా నిర్మూలన కోసం చేపట్టిన నవోదయం-2 కార్యక్రమం అమలు గురించి సమీక్ష నిర్వహించారు. కంభం ఎక్సైజ్ పరిధిలో 2 గ్రామాలలో నాటుసారా తయారీ, అమ్మకాలు ఉన్నాయని తెలిపారు. గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీల సహకారంతో సారా నిర్మూలన కొరకు కృషి చేస్తున్నామని, ఇందుకు రెవిన్యూ, పోలీసుశాఖల సహకారం తీసుకుంటున్నామన్నారు. నల్లబెల్లం అమ్మే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సారాతయారీకి బెల్లం అమ్మకుండా నియంత్రిస్తున్నా మన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ మద్యం దుకాణాల వద్ద ఆర్డర్లీమెస్ గురించి క్యూఆర్ కోడ్ చెక్ చేయడం, బహిరంగ మద్యపానం లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి, ఎస్సై కిరన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● విద్యుత్ ఈఈ శ్రీనివాసులు

పొదిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ దర్శి ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కాటూరివారిపాలెం గ్రామంలో సోలార్ విద్యుత్‌పై విద్యుత్ అధికారులకు, గ్రామస్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని భావితరాల వారికి ఆరోగ్యకరమైన పర్యావరణ సంపదను అందిద్దామన్నారు. ఈ పథకం క్రింద రెండు లక్షల విలువైన 3 కిలోవాట్‌ల సోలార్ ప్యానల్‌ను 78వేల సబ్సిడి రాయితీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు. 1కిలోవాట్ 30వేలు, 2కిలోవాట్‌లు 60వేలు, 3కిలోవాట్‌లు ఆపైన 78వేలు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ పథకంలో తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణంకూడా పొందవచ్చన్నారు. అంతేకాకుండా 25 ఏళ్లపాటు ఉచితంగా విద్యుత్ పొందవచ్చన్నారు. ఇంటి అవసరాలకు పోను మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా తిరిగి ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇక వినియోగదారులు అధికలోడును క్రమబద్దీకరించుకునేందకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. తద్వారా డెవలప్‌మెంట్ చార్జీలో 50శాతం రాయితీ పొందాలన్నారు. ఈ అవకాశం ఏప్రిల్ 1నుండి జూన్ 30వరకు సంబంధిత వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. మీకు దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ హరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

### బెల్లం ఊట ధ్వంసం

పెద్దదోర్నాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖాధికారులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా చెర్లోపల్లి అటవీ ప్రాంతంలో ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేస్తున్న క్రమంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీ కోసం ఉన్న డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు.

## విద్యుదాఘాతంతో గడ్డివామి దగ్ధం

వెలిగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గడ్డివామి దగ్ధమైన సంఘటన మండలంలోని కొటాలపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొటాలపల్లి గ్రామానికి చెందిన కొండు వెంకటేశ్వర్లు మూడు ఎకరాల్లో ఎండుగడ్డిని కొనుగోలుచేసి రహదారి పక్కన గడ్డివామిని ఏర్పాటుచేసుకున్నారు. విద్యుత్ తీగలు గాలికి ఊగి నిప్పురవ్వలు రేగి గడ్డివాముపై పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. రూ. 50వేలకుపైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముండ్లమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వ ర అగ్రహారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ నాయకుడు దేవినేని కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా రూ.7,550గా మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. దళారుల మాట నమ్మి వారికి విక్రయించవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటూరి గురవయ్య, గంగినేని రామాంజనేయులు, నీటి విని యోగదారుల సంఘం అధ్యక్షుడు కంచుమాటి నాగేశ్వర రావు, మీనగ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి

దర్శి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదావ పట్టిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో ఆవులు మృతిచెందాయని తప్పుడు ప్రచారం చేయటం దారుణమన్నారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్న వ్యక్తులు ఎవరూ బతికి బట్టకట్టలేదన్నారు. అసత్య ప్రచారాలు చేసిన వారు భవిష్యత్తులో తగుమూల్యం చెల్లిస్తారని ఆమె స్పష్టం చేశారు.

## విద్యార్థుల డ్రాప్‌అవుట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

తాళ్లూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, డ్రాప్ అవుట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడు, తాళ్లూరు, తూర్పుగంగవరం క్లస్టర్ కాంప్లెక్స్‌లో విద్యార్థుల నమోదుపై గురువారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడి మానివేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, క్లస్టర్ హెచ్‌ఎంలు కరీమ్, ఎన్.శేషగిరి, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన

తాళ్లూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం వేకువజామున కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్ రావు గురువారం పరిశీలించారు. తాళ్లూరు, కొత్తపాలెం, మాధవరం, మన్నేపల్లి, కొర్రపాటి వారిపాలెం తదితర గ్రామాల్లో పంటలను పరిశీలించారు. కోతదశలో ఉన్న మొక్కజొన్న దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్టం అంచనాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

## కిశోర బాలికలు శారీరక దృఢత్వం కలిగిఉండాలి

కనిగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు శారీరక దృఢత్వం పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం కిశోర బాలికలకు ఆరోగ్య సదస్సు నిర్వహించారు. బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించి ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం విజయభాస్కర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థిక పురోగతి పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం కనిగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బీసీ కార్పొరేషన్ కింద లబ్ధిదారులకు మంజూరైన రుణ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందినవారు ఆర్థికంగా పురోగతి సాధించేందు సీఎం చంద్రబాబు వినూత్న విధానాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా కనిగిరిలో రెండు ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రామపంచాయతీలకు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ నిధులు ద్వారా మంజూరైన పది ట్రాక్టర్లను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. గ్రామాలు చెత్తరహిత పంచాయతీలుగా రూపుదిద్దుకోవాలని అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వెలిగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జరిగిన మండలంలోని ఇమ్మడిచెరువు జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువుతో పాటు ఆటపాటలు కూడా అవసరమన్నారు. ఇమ్మడిచెరువు పాఠశాలలో హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. సినీనటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ సినిమా సూటింగ్ నిమిత్తం కనిగిరికి వారం రోజుల క్రితం వచ్చినట్టు చెప్పారు. ని యోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను చూసి పాఠశాల వార్షికోత్సవానికి వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు శ్యామల కాశిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, ముక్కు పెద్దిరెడ్డి, ఇంద్ర భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఎండలో ఇబ్బందులు పడుతుండటంతో టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి తన సొంత నిధులతో భోజనశాలను నిర్మించగా ఎమ్మెల్యే ప్రారంభించారు.

# సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూముల పరిశీలన

» జీవనోపాధి కోల్పోతామంటూ ఆర్డీవో వద్ద రైతుల ఆవేదన




ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డితో చర్చిస్తున్న రైతులు

దొనకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రసముద్రం ప్రాంతంలోని ప్రభుత్వ భూములను సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు నిమిత్తం కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి రుద్రసముద్రం ప్రాంతంలోని భూములకు చెందిన వివరాలను మ్యాపు ద్వారా ఆర్డీవోకు వివరించారు. ఈసందర్భంగా తాము భూములను కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆర్డీవో వద్ద రైతులు వాపోయారు. తమకు వ్యవసాయమే జీవనాధారమని, కొన్ని సంవత్సరాల నుంచి ఈ భూముల్లో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామన్నారు. గ్రామంలోని ప్రతిఇంటికి సంబంధించిన వారు ఈ భూముల్లో ఏళ్ల తరబడి వారసత్వంగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నట్లు చెప్పారు. ఈ భూముల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుచేస్తే తాము గ్రామం వదిలి కుటుంబాలతో వలసలు పోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధిని గుర్తించి వేల ఎకరాలు బీడుగా ఉన్న మరో ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేట్టాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్, ఏవో లక్ష్మీనారాయణ, వీఆర్వో మాచర్ల, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, సచివాలయ సర్వేయర్లు వెంకటరావు, సుధ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# రంగుమారిన ఎన్‌ఏపీ నీరు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రంగు మారిన ఎన్‌ఏపీ నీరు

ముండ్లమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు సరఫరా అవుతున్న ఎన్‌ఏపీ నీరు గత వారం పది రోజులుగా రంగుమారి వస్తున్నాయి. దీంతో దాహార్తి తీర్చుకుంటున్న ప్రజలు వ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 30 గ్రామాలకు పైగా ఎన్‌ఏపీ నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం స్టోరేజీలో నీరు అడుగంటి పోవటంతో ఎన్‌ఏపీ పైపులా ద్వారా బురద నీటితో పాటు కలుషిత మైన పురుగులు, చేప పిల్లలు వస్తున్నాయి. కొన్ని గ్రామాలకు పూర్తిగా రంగు మారి సరఫరా అవుతున్నాయి. ఈనీరు తాగిన వారికి దద్దుర్లు కూడా వస్తున్నాయి. మండలంలోని పులిపాడు, పెద ఉల్లగల్లు, కెల్లంపల్లి, పసుపుగల్లు, ముండ్లమూరు, వేంపాడు, చింతలపూడి, వేములబండ, ఉమా మహేశ్వర అగ్రహారం, తమ్మలూరు, పూరిమెట్ల, ఈదర, అయోధ్య నగర్ గ్రామాలకు ఎన్‌ఏపీ తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాలకు ప్రస్తుతం వారానికి ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈనీరు పూర్తిగా రంగు మారటం, దుర్వాసన రావటం, పురుగులు రావటంతో ప్రజలు ఆ నీటిని తాగటానికి సాహసం చేయటం లేదు. వేసవి కాలంలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య ఏర్పడింది. కనీసం రోజు మార్చి రోజైనా ఎన్‌ఏపీ నీటిని విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. నీటిని శుభ్రపరచి కుళాయిల ద్వారా సరఫరా చేయాలని కోరుతున్నారు.

# తహసీల్దార్ కార్యాలయం వెలవెల

» ఆర్డీవో కార్యాలయంలో పనుల కోసం వెళుతున్నట్టు సిబ్బంది వెల్లడి

» సమస్యలు పరిష్కారంకాక ప్రజల అవస్థలు





తహసీల్దార్ కార్యాలయం

తాళ్లూరు, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): గతవారం రోజులుగా సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోతోంది. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ లేకపోవడంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డీవో ఒంగోలు రమ్మన్నారంటూ వారం రోజులుగా ఉద్యోగులు ఇక్కడికి రావటంలేదు. గ్రామాల్లో మీసేవ, గ్రామ సచివాలయాల్లో కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్‌ల కోసం అధికారుల సంతకాలు కాకపోవడంతో దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. గత వారం రోజులుగా ఇదే తంతు కొనసాగుతున్నది. తహసీల్దార్ కార్యాలయానికి పనిమీద రావాలంటే ఇబ్బందికరంగా వుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో అధికారులు పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లినా ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేసే సర్టిఫికెట్స్‌లో జాప్యం లేకుండా ఉండేదికాదు. ప్రస్తుతం ఆపరిస్థితిలేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సక్రమంగా కార్యాలయానికి వచ్చి ప్రజల సమస్యలు, సర్టిఫికెట్లు త్వరితగతిన అందించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

తాళ్లూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఎంపీడీవో దారా హనుమంతరావు గురువారం విచారణ చేపట్టారు. 2021 నుంచి 2025 మార్చి వరకు గ్రామ పంచాయతీ 15వ ఆర్థికసంఘం నిధుల్లో దుర్వినియోగం జరిగిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు నవులూరి విద్యాసాగర్ గతనెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు డీపీవోను విచారించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. డీపీవో ఆదేశాను సారం ఎంపీడీవో హనుమంతరావు విఠలాపురం సచివాలయంలో గురువారం విచారణ చేపట్టారు. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి టి.అజయ్ కీర్తి తనకు ముందు పనిచేసిన కార్యదర్శులు రికార్డులు అందజేయలేదని విచారణలో తెలిపారు. ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన కాలంలోని రికార్డులను అందజేయాలని ఎంపీడీవో అడుగగా సాయంత్రం అందజేస్తానని తెలిపారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సాయంత్రం రికార్డులు అప్పగిస్తానని చెప్పిన కార్యదర్శి అజయ్‌కీర్తి కార్యాలయానికి రాకుండా సెల్ స్విచ్ ఆఫ్ చేశారన్నారు. ఈవిషయాన్ని డీపీవోకు తెలియపరుస్తున్నట్లు తెలిపారు. విచారణలో సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

» చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఎస్సీసెల్ నాయకులు

కనిగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప వర్గీకరణను కూటమి ప్రభుత్వం ఆమోదించంపై కనిగిరి హర్షం వ్యక్తం చేస్తూ మాదిగలు గురువారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో కనిగిరి ఎస్సీసెల్ అధ్యక్షుడు బుల్లా బాలబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోనా ప్రతాప్ మాట్లాడారు. దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చంద్రబాబు రుజువు చేశారన్నారు. ఎస్సీ సెల్ నాయకులు బలసాని కోటయ్య, తాతపూడి స్టాలిన్, కుంచెం జక్రయ్య, జాన్సన్‌లు మాట్లాడుతూ జనాభా వెనుకబాటు ఆధారంగా ఎస్సీలకు ఉన్న 15శాతం రిజర్వేషన్‌లను ఉపకులాల వారీగా వర్తింప చేసేవిధంగా సిఫారసు చేసినట్లు తెలిపారు. దీంతో ఎస్సీలలో అందరికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణ చేసి సముచిత నిర్ణయం తీసుకోవటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు గోన వెంకటయ్య, గోన బర్నబాస్, శేషం మోషే, ఎబినేజర్, కోటయ్య, వల్లెపోగు యోహాను, కుడుముల షడ్రక్, వై.ప్రభుదాసు, మధుబాబు, రామస్వామి, ఆలీస్, మోజెస్, రామయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా మోడల్ స్కూల్ నిర్మాణ పనులు

ముండ్లమూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో హాస్టల్ భవన నిర్మాణ పనులు గత నెల రోజుల నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.1.06 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో పనులు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో హాస్టల్ భవన నిర్మాణ పనులను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు మూడు నెలల్లోపే ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల రోజుల నుంచి పనులు ముమ్మరం చేశారు. మరో రెండు మూడు నెలల్లో హాస్టల్ భవన నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. 18 సంవత్సరాలుగా ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణం కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించటంతో పనులు సాగుతున్నాయి. దీంతో విద్యార్థుల ఇబ్బందులు తీరనున్నాయి.





ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న రత్నారెడ్డి ప్రతినిధులు

## పోలీసుశాఖకు డ్రోన్ కెమెరా అందజేత

పీసీపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్న పోలీసుశాఖకు మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బద్దెల రత్నారెడ్డి డ్రోన్ కెమెరాను అందజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రోన్‌ల ఉపయోగంపై పోలీసులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బిల్డర్ రత్నారెడ్డి డ్రోన్ కెమెరాను పోలీసులకు అందజేసేందుకు ముందుకువచ్చారు. గురువారం మార్కాపురంలో ఎస్పీ ఎఆర్ దామోదర్ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎస్సై కోటయ్య రత్నారెడ్డి అందించిన డ్రోన్ కెమెరాను ఎస్పీకి అందజేశారు. స్టేషన్ పరిధిలో డ్రోన్‌పై అవగాహన కల్పించి దాతల ద్వారా డ్రోన్‌ను అందజేసిన కానిస్టేబుల్ వెంక టేశ్వరరెడ్డిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, కనిగిరి సీఐ ఖాజావలి, అంజిరెడ్డి, లక్ష్మక్కపల్లి సర్పంచ్ మచ్చా మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

## యంగ్ గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్‌నాయుడు ఎంపిక గర్వకారణం

దర్శి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావటం దేశానికి, రాష్ట్రానికి గర్వకారణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో ప్రశంసించారు. రామ్మోహన్‌నాయుడు నిరంతరం ప్రజాసేవే పరమావిధిగా ముందుకు సాగుతూ రాజకీయాల్లో ఉన్నత విలువలకు మారుపేరుగా నిలిచారన్నారు. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తున్న ఆయనకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు లభించటం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడిగా ఆయనకు ఈగుర్తింపు రావటంతో పార్టీ ప్రతిష్టకు ఎంతో ఇనుమడించిందని వివరించారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## టాలెంట్ టెస్టులో దొనకొండ విద్యార్థి ప్రతిభ

దొనకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యురేకా సైన్స్ ప్రయోగాల పోటీల్లో దొనకొండ సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. ఎనిమిదో తరగతి చదువుతున్న దివ్య అనే విద్యార్థిని ఘర్షణ శక్తి అనే అంశంపై ప్రదర్శనకు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందింది. ఈమేరకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి.దేవిప్రసాద్, మండల అధ్యక్షుడు భూమా సురేష్ గురువారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థిని దివ్యకు ప్రశంసాపత్రం, సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దేవిప్రసాద్, ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఏ.ప్రభుదాసు, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ థామస్, హెచ్‌ఎం సిస్టర్ అరుణపవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

## తరచూ పగులుతున్న ఎన్‌ఏపీ పైపులైన్



గడియారస్తంభం సెంటర్‌లో ఎన్‌ఏపీ మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దర్శి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పైప్‌లైన్లు తరచూ పగిలిపోతున్నాయి. సుమారు 47 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ పైపులైన్ కాలం చెల్లిపోవటంతో సామర్థ్యం తగ్గిపోయి దెబ్బతింటున్నాయి. దీంతో మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గుతుంది. దర్శి ఎన్‌ఏపీ పథకం కింద 122 గ్రామాలు ఉన్నాయి. ఆగ్రామాలకు నీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్లు తరచూ పగిలిపోతుండటంతో మంచినీటి సరఫరాకు ఇబ్బందిగా మారుతుంది. ప్రస్తుతం పైపులైన్లు భూమికి పది అడుగుల లోతులో ఉన్నాయి. పైపులు పగిలి నీరు పైకి వచ్చిన తర్వాత గాని సిబ్బంది కనుక్కోలేకపోతున్నారు. భూమిలోపల పైపులు ఎక్కడ పగిలాయో కనుక్కొనేందుకు చాలా సమయం పడుతుంది. దీంతో మరమ్మతులు చేసేందుకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు.

## వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలి

కనిగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ముస్లిం నాయకులు ముఫ్తీ అర్షద్ అన్నారు. గురువారం స్థానిక షాదిఖానాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులన్నీ ఇస్లాం ధార్మిక కార్యక్ర మాలకు వినియోగించాలన్నారు. కేంద్రం ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయటానికి ప్రయత్నించటం సబబు కాదన్నారు. ఈనెల 21న కనిగిరిలో జరిగే ర్యాలీలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ నాయకులు యాసిన్, అహ్మద్, రోషన్ సందాని, మౌలానా యునెస్ సద్దాం, మౌలానా యాకోబ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

పామూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తానని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. పామూరు మండలం వగ్గంపల్లి గ్రామానికి చెందినపిల్లి వెంకటేశ్వరరెడ్డి 2017 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారు.

## పామూరులో ర్యాలీ

పామూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పిరమిడ్ ధ్యాన కేంద్ర అధ్యక్షుడు పందిటి అల్లూరయ్య తెలిపారు. పట్టణంలో పత్రిసాయి జ్ఞానబోధి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధర్యంలో శుక్రవారం శాఖాహారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తి రమణయ్య, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, పందిటి సౌభాగ్యం, భవాని, అనసూయ, మస్తానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పామూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై కుటుంబ కలహాల నేపథ్యం ఫ్యాన్‌కు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన గురువారం మండలంలోని వగ్గంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కందుల దుర్గారెడ్డి (33) మద్యానికి బానిసయ్యారు. భర్త గొడవ పడటంతో భార్య వరలక్ష్మి ఇద్దరు కుమార్తెలను తీసుకొని ఇంట్లో నుండి బయటకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లేసరికి భర్త ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడని తెలిపింది. పోలీసులకు సమాచారం అందించడంతో స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# 12 రోజులు.. రూ.35.97 కోట్లు



1మున్సిపాల్టీలకు కాసులే కాసులు
1కలిసివస్తోన్న 5 శాతం పన్ను రాయితీ
1స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తున్న యజమానులు
1ప్రథమస్థానంలో అద్దంకి.. నాల్గోస్థానంలో గురజాల

**ఆస్తి పన్ను చెల్లించండి.. అని ప్రచారాలు చేయకుండానే. కుళాయిలు కట్ చేస్తామని బెదిరింపులు అవసరం లేకుండానే.. యజమానులు పన్నులు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించగా పన్ను చెల్లింపుదారులు దానిని సద్వినియోగం చేసుకునేందుకు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు కాసులు వర్షం కురుస్తోంది. ఈ నెల 6వ తేదీ నుంచి పన్నుల చెల్లింపులపై రాయితీ ప్రకటించగా కేవలం 12 రోజుల్లో యజమానులు రూ.35.97 కోట్లు చెల్లించారు. గతంలో పన్నుల వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేసేవారు. కొన్ని దగ్గర్ల అయితే బకాయిలు చెల్లించని వారి కుళాయిలు కట్ చేయడం.. నోటీసులు ఇవ్వడం లాంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చేది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం రాయితీ ప్రకటన యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేలా చేసింది. ఈ రాయితీ ప్రకటనతో అధికారులు ఊహించని స్థాయిలో చెల్లింపులు జరిగాయి. ఇందులో పాత బకాయిలతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్ పన్నులు కూడా ఉన్నాయి. స్వచ్ఛంద పన్ను చెల్లింపులో రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి మున్సిపాల్టీ ప్రథమ స్థానంలో, పల్నాడు జిల్లా పరిధిలోని గురజాల మున్సిపాల్టీ నాల్గో స్థానంలో నిలిచాయి.**






(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆస్తి పన్ను రాయితీకి సంబంధించి ప్రభుత్వం ప్రకటన మున్సిపాల్టీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి విశేషస్పందన లభిస్తోంది. రాయితీ అవకాశాన్ని యజమానులు సద్వినియోగించుకుంటున్నారు. 6వ తేదీ నుంచి విస్తృతంగా పన్ను చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.35.97 కోట్లు పన్నులు చెల్లించా రు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పురపాలక సంఘాలలో పన్ను రాయితీని వినియోగించుకుని యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేందుకు బారులు తీరుతున్నారు. గతంలో పన్నుల వసూళ్లకు మున్సిపల్ సిబ్బంది ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితి లేకుండానే పన్నుదారులు ఎవరికి వారు మున్సిపల్ కార్యాలయాలకు తరలివచ్చి మరీ రాయితీపై పన్ను చెల్లిస్తున్నారు. ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మున్సిపాల్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకే రాయితీ అమలు కానున్నది. పన్నుదారులు స్పందించి పన్ను చెల్లిస్తుండటంతో ఊహించని విధంగా వసూలు జరుగుతోంది.

### పల్నాడులో నరసరావుపేట అత్యధికం

పల్నాడు జిల్లాలో ఎనిమిది మున్సిపాల్టీలకు సంబంధించి రూ.12.74 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను డిమాండ్ రూ.47.01 కోట్ల ఉండగా రూ.59.75 కోట్లు వసూలుచేయాల్సి ఉంది. కాగా 5 శాతం రాయితీపై ఇప్పటికి రూ.5.35 కోట్లు వసూలైంది. జిల్లాలో అత్యధికంగా నరసరావుపేట మున్సిపాల్టీలో రూ.1.60 కోట్లు పన్ను వసూ లైంది. వినుకొండలో రూ.77లక్షలు, చిలకలూరిపేటలో రూ.72లక్షలు, పిడుగురాళ్లలో రూ.57 లక్షలు, సత్తెనపల్లిలో రూ.74లక్ష లు, మాచర్లలో రూ.35 లక్షలు, దాచేపల్లిలో రూ.28 లక్షలు, గురజాల మున్సిపాల్టీలో రూ.17 లక్షలు చెల్లింపులు జరిగాయి.

### గుంటూరు జిల్లాలో రూ.27.12 కోట్లు

గుంటూరు జిల్లాలో పన్ను బకాయిలు రూ.206.76 కోట్లు కాగా ప్రస్తుత సంవత్సరం డిమాండ్ రూ.218.76 కోట్లు ఉంది. బకాయిల్లో రూ 1.16 కోట్లు, డిమాండ్‌లో రూ.25.96 కోట్లు మొత్తం రూ.27.17 కోట్లు వసూలైంది. గుంటూరు కార్పొరేషన్‌లో రూ.18.77 కోట్లు, తెనాలిలో రూ.2.86 కోట్లు, మంగళగిరి.. తాడేపల్లిలో రూ.4.85 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీలో రూ.64 లక్షలు చెల్లించారు.

### బాపట్ల జిల్లాలో చీరాల ప్రథమం

బాపట్ల జిల్లాలోని మున్సిపాల్టీల్లో బకాయిలు రూ.13.05 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ రూ.29.80 కోట్లు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.42.85 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అయితే రాయితీపై ఇప్పటి వరకు రూ.3.45 కోట్లు వసూలైంది. చీరాల మున్సిపాల్టీలో రూ.1.16 కోట్లు, బాపట్లలో రూ.83 లక్షలు, రేపల్లెలో రూ.60 లక్షలు, అద్దంకి మున్సిపాల్టీలో రూ.84 లక్షలు పన్నులు చెల్లించారు.


పిల్లర్ల దశలో నిలిచిపోయిన కళాశాల నిర్మాణ పనులు(ఫైల్ ఫొటో)

# మెడికల్... మోక్షమెప్పుడు?

1అర్ధంతరంగా నిలిచిన వైద్య కళాశాల పనులు
12021లో శంకుస్థాపన.. 2023లో అరకొర పనులతో సరి
1గత ప్రభుత్వంలో నాబార్డ్ నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్లలో మెడికల్ కళాశాల ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియడంలేదు. గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన వైద్య కళాశాల ప్రస్తుతం అతీగతీ లేకుండా పోయింది. 2021లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా.. 2023లో అరకొరగా పనులను ప్రారంభించారు. బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టి వైద్య సేవలను అందుబాటులోకి తేచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల కాలపరిమితిని విధించుకుంది. కానీ అవేవీ ఆచరణ రూపం దాల్చకపోగా గడచిన ఎన్నికల నాటికి కేవలం పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తి చేయడంతో సరిపెట్టింది. అరకొరగా చేసిన పనులలోనూ పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. కళాశాల కోసం కేటాయించిన భూమి విషయంలోనూ క్విడ్ ప్రో కో జరిగిందని సమాచారం. ఆయా నివేదికలు ప్రస్తుత ప్రభుత్వం వద్దకు చేరడంతో నిర్మాణ పనులను నిలిపేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జరిగిన రెండు డీఆర్సీ సమావేశాల్లోనూ వైద్య కళాశాల అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా త్వరలోనే పనులకు శ్రీకారం చుడతామని ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి ప్రకటించారు. అయితే ఇది జరిగి నెలలు గడుస్తున్నా పనులపై స్పష్టత లేదు. దీంతో మెడికల్ కళాశాలపై జిల్లావాసుల్లో అనుమానాలు నెలకుంటున్నాయి.

### నిధులు పక్కదారి..

మెడికల్ కళాశాల నిర్మాణం కోసం నాబార్డు మంజూరు చేసిన రూ.298 కోట్ల నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందనే ఆరోపణలు ఉన్నాయి. పిల్లర్ల వరకు నిర్మాణాలు జరగ్గా రూ.110 కోట్ల వరకు ఖర్చుపెట్టినట్లు సమాచారం. ఈ పనుల బిల్లులను కూడా దాదాపు రూ.52 కోట్లు గత పాలకులు పెండింగ్‌లో పెట్టి వెళ్లగా ఈ ప్రభుత్వం వాటిని చెల్లించింది. మంజూరైన నిధులు, దేని కోసం ఎంత ఖర్చు చేశారు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులెంత అనే అంశాలపై స్పష్టత లేదు.

### కొత్త పాలసీకి అనుగుణంగా...

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించడానికి అవలంబించాల్సిన విధానంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను మొదలు పెట్టేందుకు ఇటీవలే ఎస్టిమేషన్లను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పుడు పనులను తిరిగి ప్రారంభించినా కళాశాల నిర్మాణం పూర్తయ్యేసరికి రెండేళ్లు పట్టడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

# ప్రత్యేక ఉపాధ్యాయులకు.. తీపికబురు



u ఉమ్మడి గుంటూరు జిల్లాకు 248 పోస్టులు u స్పెషల్ బీఈడీ అభ్యర్థులతో భర్తీకి సన్నాహాలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 248కి పైగా పోస్టులను ఇప్పటికే గుర్తించారు. ఆయా పోస్టులను స్పెషల్ బీఈడీ పూర్తి చేసిన అభ్య ర్థులతో భర్తీ చేయనున్నారు. ప్రత్యేక అవస రాల విద్యకు సంబంధించి శిక్షణా కేంద్రాలను సమగ్ర శిక్ష నిర్వహిస్తోంది. ఇందులో మానసిక, శారీరక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందిస్తు న్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అనేక జడ్పీ స్కూల్స్‌లో స్పెషల్ బీఈడీ పోస్టులు ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ బీఈడీ పోస్టులు 2260 ఉండగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నాయి. ఇందులో ఎస్‌జీటీ పోస్టులు 151, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 98 ఉన్నాయి. మెగా డీఎస్సీలోనే స్పెషల్ బీఈడీ పోస్టులు కలిపి భర్తీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

### భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య

ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 72 పైగా భవిత కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల విద్య విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఫిజియోథెరపి, యోగా, మానసిక దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా విద్యను అందిస్తున్నారు. స్పెషల్ బీఈడీ పూర్తిచేసిన వారి ద్వారా ఇక్కడ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసి ఆయా కేంద్రాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల్ని నియమించే అవకాశం ఉందని సంఘాల నాయకులు చెబుతున్నారు.

### పోస్టులకు పోటీ తక్కువే..

స్పెషల్ బీఈడీ పోస్టులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 248 ఉన్నా పోటీ మాత్రం తక్కువగానే ఉంటుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒకప్పుడు హైదరాబా దులోనే స్పెషల్ బీఈడీ కళాశాలలు ఉండేవి. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో కూడా కొన్ని మేనేజ్‌మెంట్స్ స్పెషల్ బీఈడీ కోర్సులు ప్రవేశ పెట్టారు. అయితే కోర్సు పూర్తి చేసిన వారు తక్కువ మంది ఉంటారని విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులకు తక్కువ పోటీ ఉంటుందని చెబుతున్నారు.

# చీరాలలో గోవా మద్యం

ఇద్దరు మహిళల అరెస్టు, 550 సీసాలు స్వాధీనం

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చీరాల్లో భారీగా గోవా మద్యం పట్టుబడింది. ఇద్దరు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి 550 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఏసీ విజయ, సీఐ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం నిందితులను స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. మండల పరిధిలోని వాడరేవు వైఎస్సార్ కాలనీలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా గోవా మద్యాన్ని గుర్తించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


గోవా మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

# ఉపాధ్యాయులకు ఊరట

v ఎట్టకేలకు తొలగిన యాప్‌ల కష్టాలు v ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్ v లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ v మాట నిలుపుకున్న మంత్రి నారా లోకేశ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరుకు యాప్.. ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్.. మధ్యాహ్న భోజనం అమలుకు యాప్.. మరుగుదొడ్ల నిర్వహణకు యాప్.. విద్యార్థుల మార్కులు అప్‌లోడుకి యాప్.. ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు ఇంతకాలం అల్లాడిపోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌లతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోదన పక్కన పెట్టాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్‌ల కష్టాల నుంచి ఊరట కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు నిత్యం పదికిపైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ తాజాగా అమల్లోకి వచ్చింది. విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500 పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.75 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశపెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు పదికిపైగా యాప్‌లో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.



నూతన యాప్ నమూనా

### ఇక అన్నింటికీ ఒకే యాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడు చేసుకుని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో వినియోగిస్తున్న లాగిన్లను పాస్వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

### పనిభారం తగ్గింపు : డీఈవో రేణుక




నూతన యాప్ వల్ల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గుతుందని డీఈవో రేణుక తెలిపారు. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకే యాప్‌లో నమోదు చేయడం వలన అనేక ప్రయోజనలు ఉంటా యన్నారు. ఇప్పటికే జిల్లాలోని హెచ్ఎం, ఉపాధ్యాయులకు యాప్ వివరాలు, ఇన్‌స్టలేషన్, ఉపయోగించే విధానం గురించి తెలియజేశామని తెలిపారు. గతంలో ఉన్న యాప్‌లను అన్ ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్వర్డ్ ఒకచోట నమోదు చేసుకుని తర్వాత అన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

# ..ఇక రయ్ రయ్

1ఇప్పటికే పలు రహదారుల విస్తరణకు ఆమోదం
1రాజధాని అమరావతి, సముద్ర తీరం కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి
1భూసేకరణ దశలో వినుకొండ-గుంటూరు, నిజాంపట్నం-గుంటూరు రోడ్లు
1తెనాలి- నారాకోడూరు, తెనాలి- మంగళగిరి రోడ్లకు ఇప్పటికే ఆమోదం
1గుంటూరు బాపట్ల, గుంటూరు- పర్చూరు రోడ్ల విస్తరణకు అడుగులు

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆం ధ్రజ్యోతి): ఒకవైపు రాజ ధాని అమరావతి కేంద్రం.. మరోవైపు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలు జిల్లా కేంద్రాలు.. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సూర్యలంక తీరం.. వీటన్నింటి మధ్య రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారుల నిర్మాణాలు, విస్తరణలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే పలు రోడ్ల పనులు ప్రారంభం కాగా మరికొన్ని ప్రతిపాదనల దశలో ఉన్నాయి. ఇవన్నీ పూర్తి అయితే ఇక అమరావతి, మూడు జిల్లా కేంద్రాలు, సూర్యలంక తీరం మధ్య రాకపోకలకు ఆటంకాలు లేకుండా రయ్‌రయ్ మంటూ వాహనదారులు రాకపోకలు చేసే అవకాశం ఉంటోంది. రాజధాని అమరావతి పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని ప్రాంతం కావడంతో పాటు.. సమీపంలోనే తీర ప్రాంతం ఉండడంతో వాటి కనెక్టివిటీని పెంచేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో గుంటూరులోని పలు రహదారులకు మహర్దశ పట్టింది. జిల్లాలో అత్యంత కీలకమైన రహదారులను జాతీయ రహదారులుగా మార్చి, నాలుగు లేన్ల రహదారులుగా విస్తరించేందుకు ఆర్ అండ్ బీ ప్రయత్నిస్తోంది. గుంటూరు, రాజధాని అమరావతికి కనెక్టివిటీలో అత్యంత కీలకమైన వినుకొండ- గుంటూరు, నిజాంపట్నం- గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. వాటికి సంబంధించిన భూసేకరణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఆరునెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి రహదారులను విస్తరించనున్నారు. ఈ రెండు రోడ్ల కోసం కేంద్రం రూ.3,105.3 కోట్లు ఖర్చు చేయనుంది. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా జిల్లాలో మరో రెండు రోడ్లను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదముద్ర వేసింది. తెనాలి- నారా కోడూరు, తెనాలి-మంగళగిరి రోడ్లను నాలుగు రోడ్లుగా విస్తరించడానికి అడుగులు పడుతున్నాయి. వాటికి సంబంధించి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అయితే వాటితోపాటు మరికొన్ని రోడ్లను విస్తరించాలని ఆర్అండ్‌బీ భావిస్తోంది.

### మూడు జిల్లాల్లో రోడ్లకు మహర్దశ



### పాత మద్రాసు రోడ్డు విస్తరణ?

రాజధానికి అత్యంత సమీపంలో ఉండడంతో సూర్యలంక బీచ్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఈ బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కూడా

(మిగతా 6లో)



దైవాలరావూరులో రీ సర్వేను
పరిశీలించి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

## రీసర్వేను వేగవంతం చేయండి

మేదరమెట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దైవాలరావూరులో జరుగుతున్న రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి ఆదేశించారు. గురువారం దైవాలరావూరు వచ్చిన ఆయన వీఆర్వోలు, సర్వేయర్లు, రీ-సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో రీ-సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 75శాతం సర్వే నంబర్లవారీగా విస్తీర్ణాలను రైతులు భాగస్వామ్యంతో పూర్తి చేశామని, మిగిలిన సర్వే నంబర్లలో సమస్యలుంటే రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ ఇక్కడే అందుబాటులో ఉంటారన్నారు. తప్పులు దొర్లకుండా డీఎల్ఆర్‌ను పూర్తి చేయాలన్నారు. వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను పొరపాట్లు దొర్లకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రీ-సర్వే డీటీ రవికాంత్, సర్వేయర్ మహేష్‌బాబు, ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వోలు నరసింహారావు, నారాయణ, మారుతి, సుధాకర్ పాల్గొన్నారు.

## పెళ్లింట విషాదం

- విద్యుదాఘాతానికి తండ్రి మృతి
- శోకసంద్రంలో కుటుంబం



చుక్కా శ్రీనివాసరావు(ఫైల్)

బోయినవారిపాలెం (చీరాల), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కుమారుడికి పెళ్లి కుదిరింది. అంతా ఘనంగా చేయాలంటూ ఎంతో ఉత్సాహంగా అందుకు సంబంధించి పనుల్లో నిమగ్నమైన తండ్రిని విధి వంచించింది. విద్యుదాఘాతానికి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన చుక్కా శ్రీనివాసరావు(52), లక్ష్మీ దంపతులు. వీరిది వ్యవసాయ కుటుంబం కాగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి గతంలోనే పెళ్లి అయింది. గత ఆదివారం గ్రామంలోనే రెండో కుమారుడి మహేష్‌కు పెద్దల సమక్షంలో సంబంధం కుదిరింది. వచ్చే నెలలో పెళ్లి నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కుమారుడి కోసం పూరింటికి గడ్డి కప్పుతుండగా ఇంటిపై ఉన్న విద్యుత్ తీగల జాయింట్ చేతికి తగిలి శ్రీనివాసరావు కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి మృతి చెందారు. దీంతో సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకున్న మృతదేహానికి గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



చీరాల పట్టణంలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

## చీరాలలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడీ గురువారం రాత్రి చీరాల పట్టణం, పేరాల ప్రధాన సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కూడా చేశారు. తనిఖీలు చేస్తున్న సమయంలో సమీప బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు పరుగులు తీశారు. జిల్లాలో ఏకకాలంలో జరిగిన ఆకస్మిక తనిఖీలతో వాహనదారులు, నేరగాళ్లు ఉలిక్కిపడ్డారు. అనుకోకుండా పోలీస్ బాస్ రావడంతో స్థానిక పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు.

### మార్టూరు సెంటర్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

మార్టూరు: ఎస్పీ ఆదేశాలు మేరకు గురువారం రాత్రి మార్టూరు సెంటర్లో సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాను తనిఖీ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనచోదకులను అదుపులోకి తీసుకోవడంతోపాటు పలు చర్యలు చేపట్టారు.

## ప్రభుత్వ బడిలో చేర్పించండి

- ఇంటింటికీ తిరిగి అవగాహన పెంచుతున్న ఉపాధ్యాయులు

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న వసతుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థులు చదువుతున్న తరగతి నుంచి అప్‌గ్రేడ్ చేసి వారు మరలా ప్రభుత్వ పాఠశాలలోనే ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎంఈవోలు వస్త్రంనాయక్, కె.రమేష్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు.

## ..ఇక రయ్ రయ్

(5వ పేజీ తరువాయి)

కేటాయించింది. స్వదేశీ దర్శన్- 2.0 కింద బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.97.52 కోట్లు కేటాయించింది. దీనికి తోడు ఇప్పటికే బాపట్ల జిల్లాగా మారడం, ఎన్‌హెచ్-216 జాతీయ రహదారి బాపట్ల గుండా వెళుతుండడంతో కనెక్టివిటీ పెరిగింది. ఈ నేపథ్యలో బాపట్ల నుంచి గుంటూరు, రాజధానికి మధ్య రాకపోకలు బాగా పెరిగాయి. ఈ అవసరాలను ప్రస్తుతం ఉన్న గుంటూరు- చీరాల రోడ్డు తీర్చలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆ రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించాలన్న ప్రతిపాదనలు కూడా తెరపైకి వచ్చింది. అయితే ఈ రోడ్డును నాలుగు వరసల రోడ్డుగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు గుంటూరు-పర్చూరు రోడ్డును కూడా నాగులుప్పలపాడు వరకు నాలుగు రోడ్లుగా విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుంటూరు- పర్చూరు- ఒంగోలు- నెల్లూరు మీదగా వెళ్లే ఈ రోడ్డును గతంలో పాత మద్రాసు రోడ్డు అని పిలచేవారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు పర్చూరు వద్ద నకిరేకల్లు- ఓడరేవు జాతీయ రహదారి కూడా అనుసంధానం అవుతోంది. దీంతో ఆ రోడ్డుపై కూడా రద్దీ పెరిగింది. ఆ రోడ్డు గుంటూరు- ప్రత్తిపాడు- పెదనందిపాడు- పర్చూరు- ఇంకొల్లు మీదగా 84.5 కి.మీ వెళ్లి నాగులుప్పలపాడు వద్ద ఒంగోలు- దిగమర్రు జాతీయ రహదారి ఎన్‌హెచ్-216లో కలుస్తుంది. దీంతో గుంటూరు- నాగులుప్పలపాడు మధ్య కూడా ఈ రోడ్డును నాలుగు రోడ్లుగా విస్తరించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు రోడ్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇస్తే ఆ రెండు రోడ్లు కూడా నాలుగు రోడ్లుగా విస్తరిస్తారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రూపు రేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

# లక్ష్యానికి ఆమడ దూరంలో మార్కెట్ కమిటీ

### కొరవడిన పర్యవేక్షణ సిబ్బంది చేతివాటంతో తగ్గిన ఆదాయం

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తులపై వ్యాపారుల నుంచి సెస్ రూపేణా ఆదాయాన్ని సమకూర్చుకోవటంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వెనుకబడింది. 2024-25 సంవత్సరంలో రూ.3.89.50కోట్ల పన్ను లక్ష్యం కాగా కేవలం 2.84 కోట్లు మాత్రమే వసూలు చేశారు. 27శాతం వెనుకబడింది. పర్చూరు ప్రాంతం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యం. ఇక్కడ అన్ని పంటలను రైతులు సాగుచేస్తారు. నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. వరి, శనగ, పొగాకు, మొక్కజొన్న, మిర్చి, పత్తి, పెసలు, మినుములు తదితరాలు సాగులో ఉంటాయి. గత రెండేళ్లుగా దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట ఉత్పత్తులపై మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో భారీగా ఆదాయం రావచ్చని మార్కెట్ శాఖ అధికారులు అంచనా వేశారు. 2022-23లో రూ.3కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, రూ.3.82కోట్లు అంటే 27 శాతం అదనంగా వచ్చింది. 2023-24లో రూ.3.82 కోట్లు లక్ష్యం కాగా 3.34కోట్లు మాత్రమే వసూలు చేసి లక్ష్యం కన్నా 13శాతం తక్కువగా చేయడం గమనార్హం. 2024-25లో పన్ను శాతం 27 శాతం పైగా తగ్గిపోవడం మార్కెట్ శాఖ అధికారులు సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఇంతగా ఆదాయం ఎందుకు తగ్గింది అనే అంచనాలపై సమీక్షిస్తున్నట్లు సమాచారం. పంట ఉత్పత్తులు ఎక్కువ శాతం శీతల గిడ్డంగుల్లో నిల్వచేస్తుంటారు. వ్యాపారులు అక్కడ నుంచే కొనుగోలు చేసి తరలిస్తుంటారు. శీతల గిడ్డంగుల వద్ద వ్యాపారుల కదలికలపై దృష్టి పెడితే మార్కెట్ కమిటీ ఆదాయం ఆశించిన విధంగా ఉంటుంది. కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు కొనుగోలు చేసి తరలించే సమయంలో అవినీతికి అలవాటు పడిన కొందరు సిబ్బంది వెళ్లి అనధికారికంగా డబ్బులు తీసుకొని జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్ కమిటీలోని కొందరు అవినీతి అధికారులకు ఇందులో వాటా ఉన్నట్లు సమాచారం. సిబ్బందికి మామూళ్లు ఇవ్వడం ద్వారా చెల్లించాల్సిన దానిలో 4వ వంతు మాత్రమే ఇచ్చి వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### పన్ను వసూళ్లకు 20 మంది అవుట్ సోర్స్ ఉద్యోగులు

పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పన్ను వసూళ్లకు 20 మంది అవుట్ సోర్స్ ఉద్యోగులు ఉన్నారు. ప్రాంతాలవారీగా విభజించి 19 మందిని వివిధ చోట్ల పన్ను వసూళ్లకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న సిబ్బందికి చాలా మంది వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో వారి కార్యకలాపాలపై పూర్తిస్థాయి అవగాహన ఉంది. దీంతో మార్కెట్ కమిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. దాదాపు రెండు సంవత్సరాలుగా పాలక వర్గం లేక సిబ్బంది చేతివాటానికి కలసి వచ్చిందని అంటున్నారు. తాజాగా ప్రభుత్వం మార్కెట్ కమిటీలపై దృష్టి సారించి కమిటీ ఛైర్మన్‌ల నియామకం చేపట్టింది. అందులో భాగంగా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన గుంజి వెంకట్రావును పర్చూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్త పాలకవర్గం ఆదాయ లక్ష్యంపై దృష్టి సారిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.



పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

## నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- ఎస్పీ దామోదర్

మార్కాపురం రూరల్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి). పట్టణంలో పోలీసుల పటిష్ట నిఘా ఉంటుదని నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన కర్డెన్ సర్చ్‌ను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కోర్టు కూడలి, కంభం బస్టాండ్, గడియార స్తంభం కూడలిలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పట్టణ ప్రజలు జీవించేలా పోలీసులకు అండగా నిలవాలన్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నేరాల నియంత్రణ చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్ రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ, ఏకలవ్య కాలనీలతో పాటు పలు ప్రాంతాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానకూడలిలో సరైన పత్రాలు లేని వాహనాలను ఆపి పరిశీలించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ కే.నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సాయిఈశ్వర్, నాగరాజు, రమణ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్పీ, పోలీసులు

## ఒంగోలులో దొంగలు హల్‌చల్

- బైక్‌లపై తిరుగుతూ దోపిడీలు
- పోలీసుల అదుపులో నలుగురు దుండగులు?

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో బైక్‌లపై రాత్రుళ్లు తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు దుండగులు. దారి కాచి దోపిడీలు చేస్తున్నారు. దీంతో నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. ఈక్రమంలో బుధవారం రాత్రి 11గంటల మొదలు గురువారం తెల్లవారుజామున 4 గంటల వరకు నలుగురు దుండగులు బైక్‌లపై సంచరిస్తూ పలు ప్రాంతాలలో దారి దోపిడీలకు పాల్పడ్డారు. వీరిలో ఓ పాత నేరస్థుడు ఈ ముఠాకు నాయకత్వం వహించాడు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో, మార్కెట్ యార్డు ఎదురు, నెల్లూరు బస్టాండ్ ప్రాంతంలో ఈ నలుగురు బైక్‌లపై రాత్రి అంతా తిరుగుతూ కనిపించిన వారిని బెదిరించి వారి వద్ద సెల్‌ఫోన్లు, జేబుల్లో ఎంత నగదు ఉంటే అంత ఇచ్చే వరకు దాడులు చేశారు.

అంతేకాకుండా స్థానిక మంగమ్మ కాలేజీ సమీపంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆలయ తలుపుల తాళాలు పగులగొట్టారు. హుండీని పగులగొట్టేందుకు విఫలయత్నం చేశారు. ఇలా నలుగురు దుండగులు తమ ఇష్టానుసారం రాత్రి అంతా నగరంలో హల్‌చల్ చేశారు. స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన నాగూరు అనే పాత నేరస్థుడు, మరో ముగ్గురు యువకులతో కలిసి ఈ దారి దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గురువారం ఉదయం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

## హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

- అపరాధ రుసుము విధింపు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం కేసులో ఆరుగురుకి జైలు శిక్ష, అపరాధ రుసుము విధిస్తూ అద్దంకి అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి గురువారం తీర్పు ఇచ్చారు. అద్దంకి మండలం మైలవరంలో 2020 సంవత్సరం ఆగస్టు 21వ తేదీన స్థలం వివాదంలో మన్నేపల్లి వెంకటేశ్వర్లును అదే గ్రామానికి చెందిన 7 గురు పథకం ప్రకారం మూకుమ్మడిగా దాడి చేసి, కొట్టి చంపడానికి ప్రయత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేష్ కేసు నమోదు చేశారు. కేసు విచారణకు రాగా సీఐ సుబ్బరాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి కోర్టు కానిస్టేబుల్ రమణ ద్వారా సాక్షులు సక్రమంగా వాయిదాలకు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకున్నారు.

అద్దంకి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరనారాయణ తగిన సాక్ష్యాధారాలతో నిందితులు నేరం చేసినట్లు నిరూపించడంతో కుడుములపల్లి కోటయ్యకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.12వేల అపరాధ రుసుము, కొండ నాగరాజుకు ఏడాది జైలు, రూ.7వేల అపరాధ రుసుము, మిగిలిన నలుగురు ఉడుములపల్లి సోమయ్య, కుడుములపల్లి పెద్ద కోటయ్య, కుడుములపల్లి శ్రీనివాసరావు, కొండ చిరంజీవికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.7వేల అపరాధ రుసుము విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నాగ వెంకటలక్ష్మి తీర్పు చెప్పినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నిందితులకు శిక్ష పడే విధంగా తగిన చర్యలు తీసుకున్న సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చాలి

మార్టూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మార్చేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం, ఉద్యాన, వ్యవసాయ, వెలుగు శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని వ్యవసాయశాఖ మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై ఆయా శాఖల మండల స్థాయి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి జానకి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కలిగించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఏవో అంజిరెడ్డి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం, మంచి ఆరోగ్యం ప్రకృతి వ్యవసాయం ద్వారా వస్తాయన్నారు. జానకి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం ఆదర్శ రైతులు రామచంద్రరావు, రామాంజనేయులును సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేంద్రబాబు, అడిషనల్ డీపీఎం మోహన్, టీం లీడర్ రాజశేఖర్, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, చందనదుర్గ, శివశంకర్, మండల సమాఖ్య ప్రతినిధులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌యానిమేటర్లు పాల్గొన్నారు.



వంగ తోటలో పిచికారీ చేసేందుకు
తయారు చేస్తున్న కషాయాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి

### ప్రకృతి సాగుతో ఆరోగ్యం

యద్దనపూడి: రైతులు తమ సొంత పొలంలో కొంత భాగమైనా ప్రకృతి వ్యవసాయంద్వారా సాగు చేపడితే కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు గురువారం యద్దనపూడి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మేర మ్మ, వెలుగు ఏపీఎం వెంకటరావు, మార్కెటింగ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

### ప్రకృతి పద్ధతిలో వంగసాగు

పంగులూరు : ప్రకృతి వ్యవసాయ విధానంలో వంగ సాగు లాభదాయకంగా ఉందంటున్నారు రామకూరు రైతు మానం శ్రీనివాసరావు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు మండలంలో రామకూరు, కోటపాడు గ్రామాలను ఎంపిక చేశారు. రామకూరు గ్రామంలో ఐసీఆర్‌పీల ప్రోత్సాహంతో మానం శ్రీనివాసరావు ఎకరా విస్తీర్ణంలో వంగసాగు చేపట్టారు. సహజ పద్ధతిలో సాగు చేస్తున్న వంగలో తెగుళ్ళ, క్రిమికీటకాల నివారణ కోసం ఐసీఆర్‌పీల సూచనలతో పైరుపై పిచికారీ చేసే కషాయాన్ని తయారు చేసి తెగుళ్ల, క్రిమికీటకాల నివారణ చర్యలు చేపడుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. పంచామృతం, పసుపు, ఇంగువతో పాటు పులిసిన మజ్జిగ, బెల్లంతో తయారు చేసిన కషాయం వినియోగంతో పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తున్నాయని రైతు శ్రీనివాసరావు తెలిపారు. గురువారం వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి వంగ తోటను, తయారు చేస్తున్న కషాయాన్ని పరిశీలించారు. కషాయం పిచికారీతో ఆకుమచ్చ తెగులు, పోషకాల లోపం నివారించవచ్చన్నారు. మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, ఏఈవో పృథ్వీ, రైతులు పంటను పరిశీలించారు.

### డ్రోన్ కెమెరాతో మందుబాబుల పట్టివేత

ఇంకొల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఐ సరేష్‌బాబు అధునాతన పరిజ్ఞానంతో బహిరంగ ప్రదేశాలలో మందు సేవిస్తున్న మందుబాబులను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. నాగుచెరువు కట్టపై కొంతమంది బహిరంగంగా మద్యం సేవిస్తుండగా డ్రోన్ కెమెరా సాయంతో వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇకపై రాత్రి వేళ్లలో నిఘా పెంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నట్లు తెలిపారు.

### బాల్య వివాహాలు వద్దు

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నిర్ణీత వయస్సు లేకుండా బాల్య వివాహాలను చేయడం మంచిది కాదని, బాల్య వివాహం చట్ట రీత్యా నేరమని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు బాల్య వివాహాల వలన ఎదురయ్యే ఇబ్బందులు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



జడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపకరణాలు
అందిస్తున్న ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రతినిధులు

## పాఠశాలలకు ఉపకరణాల బహూకరణ

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలతో పాటు కోటపాడు యూపీ పాఠశాలకు లక్షల విలువ చేసే ఉపకరణాలను అందచేసి తమ వితరణ చాటుకున్నారు ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ లిమిటెడ్ ప్రతినిధులు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్, సీపీయూ, 8 సీలింగ్ ఫ్యాన్‌లు, 25 కుర్చీలు, రెండు ర్యాకులను, అలాగే కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు బీరువాలు, డెస్క్‌టాప్‌తో పాటు, డెస్క్‌టాప్ టేబుల్, మూడు ఎస్ టైప్ కుర్చీలు, ఆఫీస్ టేబుల్‌ను అందజేశారు. పాఠశాలలకు వసతులతో పాటు విద్యా ఉపకరణాలు అందజేసిన ఏపీ మిడ్‌వెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ మేనేజర్ అంబటి శ్రీనివాసరావు, అందుకు ప్రోత్సాహాన్నిచ్చిన ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ నతానియేల్‌కు హెచ్ఎం ఇమ్మడిశెట్టి అణిత, వడ్లమూడి వేణుబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాసరావు, చింతల సహదేవుడు, విద్యాదాత బొప్పుడి నాగేశ్వరరావు, రావుల వెంకన్న, సురేష్, హరిబాబు, జనార్ధనరావు, నాగేశ్వరరావు, పేర్ని వీరనారాయణ, బుల్లిబాబు, స్టాఫ్ సెక్రటరీ రామకోటిరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతలపాడులో ప్లాస్టిక్ టబ్‌లను
పంపిణీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార స్వామి

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌పీవో జి.కుమార స్వామి అన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తను సేకరించేటప్పుడు విధిగా తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ప్లాస్టిక్ టబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, కృష్ణమోహన్, నాయకులు పాల్గొన్నారు.

## మెప్మా ఒంగోలు సీఎంఎం విధుల నుంచి తొలగింపు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
- ఉత్వర్వులు జారీ చేసిన పీడీ శ్రీధర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఒంగోలు సిటీ మిషన్ కల్పనను విధుల నుంచి తొలగించి, రాష్ట్ర మిషన్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మార్కాపురంలో జరిగిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కాగా, ఈ కార్యక్రమానికి ఖర్చుల పేరుతో ఆర్పీల నుంచి రూ.400 చొప్పున వసూలు చేయడంపై సీఎంఎం అవినీతిని ఆంధ్రజ్యోతి 'సీఎం సభ పేరుతో వసూళ్ళు' కథనం ప్రచురించింది. దీనిపై మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలతో ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పట్టణ పొదుపు సంఘాల సమాఖ్య సంఘాలు 134 ఉండగా ఒక్కో సంఘం నుంచి రూ.1000 వసూలు చేశారు. సహకార శాఖకు ఒక సమాఖ్య నుంచి రూ.50 చెల్లించడం, మిగిలిన సొమ్ము కాజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో కల్పనను విధుల నుంచి తొలగిస్తూ రాష్ట్ర మిషెన్‌డైరెక్టర్‌కు సరెండర్ చేశారు.

## తప్పిపోయిన చిన్నారి

- తండ్రికి అప్పగించిన పోలీసులు

పెద్దదోర్నాల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన బదిర బాలుడు గురువారం ఉదయం ఇంటి నుంచి తప్పిపోయాడు. ఎంత వెదికినా కనిపించక పోవడంతో భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి ఆర్టీసీ బస్టాండు పరిసరాలలో సంచరించినట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి బాలుడిని గుర్తించారు. వెంటతీసుకుని వెళ్లి తల్లిదండ్రులకు అప్పజెప్పడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అద్దంకిలో అభివృద్ధి పనులు

» రూ.1.5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.6.5కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కొన్ని పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్‌లు పూర్తయి ప్రారంభించగా, మిగిలిన వాటికి టెండర్‌లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సుమారు రూ.1.5కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు టెండర్‌లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ అండ్ యస్‌ఎల్‌ఆర్‌యస్ పథకం ద్వారా సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరు కాగా సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, పార్కుల అభివృద్ధి చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ఆయా పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపారు. టెండర్‌లు పిలిచేందుకు సిద్ధం చేస్తున్నారు. జనరల్ ఫండ్ నుంచి


న్యూ ఎస్‌బీఐ కాలనీ నుంచి నాగులపాడు రోడ్డు వరకు సైడ్ డ్రైన్ నిర్మాణానికి తవ్విన కాలువ

సుమారు కోటి రూపాయలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో పట్టణంలోని ఆయా ప్రాంతాలలో రోడ్లు, సైడ్ డ్రైన్‌ల సమస్య తీరనుంది. పనులు వెంటనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు.


హసన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ ముస్లిం నేతలు

## ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌కు అద్దంకి నేతల శుభాకాంక్షలు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గా నియమితులైన హసన్‌బాషాను అద్దంకి నియోజకవర్గ టీడీపీ ముస్లిం నేతలు గురువారం గుంటూరులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, రఫీ, బషీర్ తదితరులు ఉన్నారు.

## డాక్టర్ సర్వేపల్లికి నివాళి

ఇంకొల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రాలను వినియోగించుకోవాలి

**సర్పంచ్ అంజమ్మ**


మంచినీటిని అందిస్తున్న సర్పంచ్ అంజమ్మ

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ మల్లా అంజమ్మ కోరారు. గురువారం బొమ్మల సెంటర్, పైజంక్షన్‌లో రోటరీ క్లబ్‌ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కృష్ణ మోహన్, అంజనేయులు, ఉదయ్‌భాస్కర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

» వేసవి తాకిడికి ఘటనలకు అవకాశం
» వారోత్సవాల్లో వేళ జోరుగా అవగాహన కార్యక్రమాలు
» జాగ్రత్తలతోనే నష్టాలకు దూరం

చివరి మూడేళ్లుగా జరిగిన ఘటనలు

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య | నష్టం | రక్షణ |
|---|---|---|---|
| 2022 - 23 | 78 | 79,23,000 | 1,19,87,000 |
| 2023 - 24 | 92 | 100,95,12,000 | 151,69,48,000 |
| 2024 - 25 | 66 | 4,89,25,000 | 7,60,15,000 |


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు ఎండలు మండుతున్నాయి. చీరాల, చుట్టపక్కల అధిక సంఖ్యలో రైతులు, కూలీలు ఉన్నారు. ఈక్రమంలో పాడి, పంట సహజంగానే ఉంటాయి. ప్రతి ఏటా ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. చీరాల కేంద్రంగా చీరాల, వేటపాలెం, కారంచేడు, పర్చూరు, చినగంజాం, ఇంకొల్లు మండలాలకు చీరాల నుంచే గంటల బండి (అగ్నిమాపక వాహనం) వెళ్లాల్సి ఉంది. అయితే ఇక్కడ ప్రస్తుతం రెండు వాహనాలు ఉండగా (ఒకటి చిన్నది, మరొకటి పెద్దది) 22 మంది సిబ్బంది ఉన్నారు. ఇంకా సిబ్బంది కొరత ఉంది. అలాగే ఇన్ని ప్రాంతాలకు సంబంధించి వాటర్ బండి 01, మిస్ట్ విష్‌కాల్ వాహనం 01 (ఇరుకు సందుల్లో తిరిగే బండి), బుల్లెట్ 01 మాత్రమే ఉన్నాయి. జిల్లా విభజన జరిగి రెండేళ్లవుతున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వసతులు ఉన్నాయి. మరోవైపు ఈనెల 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలను అధికారులు జోరుగా నిర్వహిస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అవసరంగా అభి వృద్ధి, వసతులు పెరగాల్సి ఉంది. ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రాలపై దృష్టి సారించాలి.

అగ్ని ప్రమాదాలను నియంత్రించాలంటే ముందుగా నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలి. ఆ జాగ్రత్తలు పాటించాలి. గతంలో మండల పరిధిలోని కావూరివారిపాలెంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా ఒకే వీధిలో సుమారు 13 పూరిళ్లు గంటలోనే బూడిదయ్యాయి. అంతేకాకుండా చీరాల నుంచి అందుబాటులో ఉన్నది రెండు వాహనాలే కావడంతో 6 మండలాలపై దృష్టి సారించడం కష్టతరంగానే భావించాలి. ఉదాహరణకు ఒక మండలం నుంచి మరో మండాలనికి విస్తీర్ణం అధికంగా ఉండటంతో సాధ్యసాధ్యాలు బేరీజు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు చెప్తున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1 గడువు చెల్లిన గ్యాస్ పైపులు, నాణ్యత లేని పైపులు వాడరాదు.
2 వంట గదిలో అదనపు గ్యాస్ సిలిండర్, కిరోసిన్, డీజిల్ వంటివి ఉంచకూడదు
3 నివాసాల్లో జాయింట్‌తో కూడిన విద్యుత్ తీగలు ఉంచరాదు.
4 గడ్డివాముల సమీపంలో మంటలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి.
5 వంట సమయంలో కాటన్ దుస్తులను వినియోగించాలి
6 టపాకాయలు కాల్చే సమయంలో పరిసరాలపై దృష్టి సారించాలి
7 ఇంట్లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలి

### గ్యాస్ నుంచే వచ్చే మంటలు ఆర్పడంపై అవగాహన

అద్దంకి : వంట గదిలో గ్యాస్ లీకై వచ్చే మంటలు ఆర్పడంపై విద్యార్థినులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఏర్పడే మంటలు ఆర్పడంపై బాలికలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం



వేసవి ప్రభావంతో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశం అధికం. ఈ నేపథ్యంలో వారోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజల్లో ముఖ్యంగా గృహిణిల్లో ధైర్యం నింపుతున్నాం. అలాగే నివాసాల్లో జాగ్రత్తలు కూడా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈక్రమంలో గడ్డి వాములు, పూరిళ్లు, విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి.

**- వీవీ రామకృష్ణ, సహాయ అగ్నిమాపక జిల్లా అధికారి**

# పరిశుభ్రతకు తోడ్పాటును అందించండి

» అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష
» 21న మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో మీకోసం


అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మన ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టి సారించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామాపురంలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం నిర్వహించనున్న శానిటేషన్ కార్యక్రమం రేపు శనివారం రామాపురం తీరంలో జరుగనుంది. అందుకు సంబంధించి ఎమ్మెల్యే కొండయ్య ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. అలాగే ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ప్రజా పిర్యాదుల వేదిక మీకోసం కార్యక్రమం ఈనెల 21న చీరాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ పాల్గొననున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎండీ మొయిన్, తహసీల్దార్‌లు గోపీకృష్ణ, పార్వతి, డీఎల్‌పీవో శివన్నారాయణ, అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# ఎస్సీ సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం మేలు


క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సీ నాయకులు


అద్దంకిలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఎస్సీ సామాజిక వర్గానికి మేలు చేసిందని ఆ సామాజికవర్గం నాయకులు అన్నారు. గురువారం నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ వలన డీఎస్సీతో పాటు పలు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు, విద్యాలయాల్లో సీట్లు భర్తీకు దోహదపడుతుందని అన్నారు. తద్వారా అణగారిన ప్రజల బతుకులు సాఫీగా సాగుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మున్నంగా అరుణ్ కుమార్, ఉసురుపాటి సురేష్, రావినూతల నాగేశ్వరరావు, గూడూరు శివరామప్రసాద్, ఏసురత్నం, జేమ్స్, దుడ్డు అంకమ్మరావు, సైమన్, వినోద్ పాల్గొన్నారు.

### ఆర్డినెన్స్‌పై ఎస్సీ సెల్ నేతల హర్షం

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కు కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావడం పట్ల టీడీపీ ఎస్సీ సెల్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ అద్దంకి నియోజకవర్గ వలపర్ల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం చంద్రబాబు ఎస్సీలలోని 59 కులాలకు న్యాయం జరిగిలా ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ డీఎస్సీ నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు వచ్చిందన్నారు. ఇందుకు సహకరించిన కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ నేతలు మందా నాగేశ్వరరావు, అబ్రహం, కత్తి అశోక్, స్టాలిన్, నరేంద్ర, స్వామి, సామ్యూల్, రాజశేఖర్, కోటయ్య పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడాపై అవగాహన

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి గ్రామాలలో ఐసీడీఎస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. గురువారం కొణిదెన, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడులో తల్లులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వెయ్యి రోజుల్లో బిడ్డకు అందించాల్సిన అహారంపై చిత్రాలను గీసి వారికి తెలియజేశారు. కార్యక్రమాలలో సూపర్ వైజర్లు విజయ నిర్మలా, సలోమి, మీరాబీ, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్యశాల ప్రాంగణంలో మందులను తీసుకెళ్తున్న సిబ్బంది

## పశు వైద్య శాల సిబ్బంది అవస్థలు

» మందులను నిల్వ చేసుకునే వసతి కరువు
» ఒక్కరోజులోనే వాటి పంపిణీకి పరుగులు

పర్చూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుల (ఏడీ) కార్యాలయం, ఆసుపత్రిలో అసౌకర్యాల నడుమ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సొంత భవనం నిర్మించాలన్న దశాబ్దాల ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. చాలీచాలని ఇరుకు గదులు, ప్రాంగణంలో ఇటు ఇబ్బంది, అటు పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణ స్థలంలో ఆక్రమించి కట్టిన నివాసంలో తాత్కాలికంగా పశు వైద్యశాలను నడుపుతున్నారు. రెండు చిన్నగదులే ఉండడంతో కనీసం మందులు భద్రపరుచుకునే అవకాశం లేదు. గురువారం ఏడీ పరిధిలో ఆయా గ్రామీణ పశువుల ఆసుపత్రులకు మందులు పంపిణీ చేసేందుకు పెద్ద మొత్తంలో పర్చూరు పశువైద్యశాల (ఏడీ)కు మందులు వచ్చాయి. ఇక్కడ మందులు నిల్వ చేసే వసతి లేకపోవడంతో వైద్యశాల ఆవరణలోనే వెనువెంటనే ఆయా పశు వైద్యశాలలకు మందులను పంపిణీ చేశారు. ఈ క్రమంలో దీంతో మందులు ఇచ్చిన వారు, తీసుకెళ్లేందుకు వచ్చిన సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.

## రైతులను ఆదుకోవాలి

పంగులూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షానికి అద్దంకి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. కోతదశలో ఉన్న మొక్కజొన్న నేల వాలడంతో నష్టం జరిగిందన్నారు. మొక్కజొన్న, మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారవు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, కృష్ణకుమారి, సుబ్బరాజు, ఏలియా పాల్గొన్నారు.

### నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలి

మార్టూరు : అకాల వర్షాలకు మండలంలో నష్టపోయిన పంటల వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదికను పంపించాలని మండల రైతు సంఘం నాయకులు గురువారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వై శ్రీనివాసరావుకు వినతిపత్రంలో కోరారు. మొక్కజొన్న, మిర్చి, బర్లీపొగాకు, మామిడికి తీవ్ర న ష్టం జరిగిందని, వెంటనే ఎన్యుమరేషన్ చేసి రైతులకు నష్టపరిహారం అందజేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తుల హ నుమంతరావు, కృష్ణమూర్తి, రాంబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న సిబ్బందికి ఓడీలను కేటాయించాలి

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలని ఎన్ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం డిపో వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. డిప్యూటేషన్‌ను కొనసాగించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయాబాబు, రవిబాబు, ప్రవీణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీహర్షిణి విద్యార్థుల ప్రతిభ

మార్టూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీహర్షిణి ఒలంపియాడ్ స్కూల్‌లో వందమంది హైస్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 66 మంది సెకెండ్ లెవెల్‌కు హాజరయ్యారని విద్యా సంస్థల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు గురువారం ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థికి అభినందనలు

బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన మందా వివేక్ క్రిస్టియన్ సంగీత పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. దీంతో గురువారం పాఠశాలలో వివేక్‌ను ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గిన్నిస్ రికార్డ్ సాధించడం గొప్పవిషయమన్నారు. అనంతరం గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థికి బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రానైట్ స్లాబుల లారీ పట్టివేత



బల్లికురవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం నుం చి అక్రమంగా, ఎలాంటి బిల్లులు లేకుండా తరలిపోతున్న గ్రానైట్ స్లా బుల లారీని గురువారం విజిలెన్స్ ఏ డీ రామంచంద్ర ఆదేశాల మే రకు ఆర్ఐ రాజు పట్టుకున్నారు. వే మవరం గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి స్లాబులతో వెళుతున్న లారీని విజిలెన్స్ అధికారులు నిలుపుదల చేసి తనిఖీలు చేయగా, సరైన పత్రాలు లేకపోవడంతో వెంటనే కేసు న మోదు చేసి పట్టుకొన్న లారీని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.


## ఆటోను ఢీకొట్టిన లారీ.. ముగ్గురికి గాయాలు


లారీ ఢీకొని బోల్తా పడిన ఆటో

చీరాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం నుంచి చెరుకుపల్లికి ఆటోలో ప్రయాణిస్తు మార్గమధ్యలో మంచినీళ్లు తాగేందుకు రోడ్డు పక్కన ఆపిన ఆటోను వేరుశనగ లోడుతో వెళుతున్న లోడు లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం జాతీయ రహదారిలో ఆర్డీవో కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదే సమయంలో ఆటో సైతం బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానికులు 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## కారు, మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కారు, మోటార్‌సైకిల్ ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు, శింగరకొండ వైపు నుంచి చక్రాయపాలెం వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ నామ్ రోడ్డులో భవనాసి చెరువు కట్ట జంక్షన్ వద్ద గురువారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న చక్రాయపాలెంకు చెందిన గుమ్మడి వెంకటవీరరామాంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఒంగోలుకు చెందిన రమ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వెంకటవీరరామాంజనేయులును ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అలాగే శింగరకొండ రోడ్డులో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. పంగులూరు మండలం చినమల్లవరానికి చెందిన శ్రీరాం, పల్నాడు జిల్లా ఇనగల్లుకు చెందిన మల్లికార్జున్ వేర్వేరు బైకులపై వస్తూ పట్నంలోని రాణి పెట్రోల్ బంక్ సమీపంలో ఒకరినొకరు ఢీకొన్నారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



**ఉష్ణోగ్రత వివరాలు**

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నెల్లూరు | 38.2 | 27.4 |
| కావలి | 36 | 28 |
| ఆత్మకూరు | 38 | 28 |
| ఉదయగిరి | 39 | 27 |
| కందుకూరు | 36 | 29 |

# మే 5న నీటి విడుదల

- 5.29 లక్షల ఎకరాలు.. 59.42 టీఎంసీలు

- రెండో పంటకు నీటి కేటాయింపుల ఖరారు
- ఐఏబీలో తీర్మానించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- లస్కర్లను తిరిగి నియమిస్తాం
- ఓఅండ్ఎం పనులకు రూ.18 కోట్ల మంజూరు
- ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించండి
- సమావేశంలో మంత్రి ఆనం వెల్లడి



ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ ఆనంద్, ప్రజాప్రతినిధులు

నెల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 5.29 లక్షల ఎకరాల్లో రెండో పంట సాగు చేసుకునేందుకు సాగునీటిసలహా మండలి (ఐఏబీ)లో తీర్మానించారు. ఇందుకు గానూ 59.42 టీఎంసీలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోగా, మే నెల 5వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశానికి మంత్రి ఆనం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ, ఎమ్మె ల్యేలు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతు నాయకులు పాల్గొన్నారు. ఎడగారులో సాగుపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించిన కేటాయింపులపై సమీక్షించి, కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సోమశిల ప్రాజెక్టులో 52.653 టీఎంసీల నీరు ఉంటుందని అంచనా వేసి డెడ్ స్టోరేజీ 7.50 టీఎంసీలు, నీటి ఆవిరి నష్టాలు 1.50 టీఎంసీలు, తాగునీటికి 3.50 టీఎంసీలను మినహాయించారు. ఈ మిగులు నీటికి సర్వేపల్లి, కనిగిరి రిజర్వాయర్లలో ఉన్న నీటిని కలుపుకుంటే నికరంగా 43.768 టీఎంసీలు మిగులుతుందని అంచనా వేశారు. ఈ నీటి ద్వారా ఒక టీఎంసీతో 8500 ఎకరాలను పండించే విధంగా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. మొత్తంగా సోమశిల కింద 3.69 లక్షల ఎకరాలకు కేటాయింపులను ప్రతిపాదించగా, వీటికి కొన్ని సవరణలు చేశారు. నీరు ఉందని వృథా చేయకుండా ఒక్కో టీఎంసీతో 9 వేల ఎకరాలను పండించే విధంగా ఇరిగేషన్ అధికారులు పనిచేయాలని మంత్రి ఆనం, ఇతర ఎమ్మెల్యేలు సూచించారు. ఈ లెక్కన 41 టీఎంసీలతోనే రెండో పంట సాగును పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కాగా కండలేరు జలాశయంలో 47.530 టీఎంసీల నీరు ఉందని అంచనా వేయగా అందులో డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు, నీటి ఆవిరి నష్టాలు 3 టీఎంసీలను మినహాయించారు. చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు కేటాయించగా, పొదల కూరు, రాపూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళ హస్తి, తిరుపతి పట్టణాల్లో తాగునీటి అవసరాలకు మరో 4.750 టీఎంసీలు కేటాయించారు. స్వర్ణముఖి బ్యారేజీకు 2 టీఎంసీలు, పరిశ్రమలకు 1.250 టీఎంసీలు కేటాయించగా కండలేరులో నికరంగా 16 టీఎంసీలు మిగులుతుందని లెక్కించారు. ఈ నీటితో నెల్లూరు జిల్లాలో 35,360 ఎకరాలు, తిరుపతి జిల్లాలో 1,24,640 ఎకరాలు పండించేలా ప్రతిపాదించి, ఆమోదించారు. మే 5వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు ఆనం ప్రకటించారు. ఈలోపు చెరు వులు, బోర్ల కింద నార్లు పోసు కోవచ్చని సూచించారు. ఎక్కువ గా ఆరుతడి పంటలు పండిం చేలా రైతులకు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకూ అవ గాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని జిల్లా అధికార యం త్రాంగాన్ని ఆదేశించారు. అంద రూ సమన్వయంతో పని చేసి నీరు వృథా కాకుండా పొదు పుగా వాడాలని మంత్రి పిలుపు నిచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ వద్ద 4 లక్షల ఎకరాలకు సరిపడే వరి విత్త నాలు, మెట్ట పంటల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు వినియోగిం చుకోవాలని ఆయన కోరారు.

**నీటి కేటాయింపు ఇలా..**

| ప్రాజెక్టు/ కాలువ | వాస్తవ ఆయకట్టు | నీరిచ్చే ఆయకట్టు | టీఎంసీలు |
|---|---|---|---|
| పెన్నార్ డెల్టా | 2,47,000 | 2,00,000 | 23.530 |
| కనుపూరు కాలువ | 66,000 | 25,000 | 2.940 |
| కావలి కాలువ | 74,000 | 74,000 | 8.710 |
| ఉత్తర కాలువ | 98,093 | 35,000 | 4.120 |
| దక్షిణ కాలువ | 35,490 | 35,000 | 4.120 |
| కండలేరు | -- | 1,60,000 | 16 |



ఐఏబీ సమావేశంలో పాల్గొన్న నీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘ నాయకులు

### లస్కర్లు, పూడికతీతపై చర్చ

ఐఏబీలో ఎమ్మెల్యేలతోపాటు ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు, డీసీల చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. మెజారిటీ సభ్యులు లస్కర్లు, పూడికతీత సమస్యలపై ప్రశ్నించారు. నీటిని పొదుపుగా వాడాలంటే కాలువల్లో పూడిక తీయడంతోపాటు లస్కర్లను నియమించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం స్పందిస్తూ... ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాలకు (నెల్లూరుసిటీ మినహా) ఓఅండ్ఎం పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ నిధులతో అత్యవసరమైన కాలువలను బాగు చేసుకోవాలని సూచించారు. అలానే మైనర్ ఇరిగేషన్ కాలువలను ఉపాధి హామీ పథకం కింద బాగు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరిగేషన్, డ్వామా అధికారులు, సాగునీటి సంఘాలు సమన్వయం చేసుకొని అవసరమైన కాలువల్లో వెంటనే పూడికతీత పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు. గత ప్రభుత్వం లస్కర్లకు రూ.4.68 కోట్ల వేతనాలు పెండింగ్ పెట్టడమేగాక వారిని తొలగించిందని ఆనం చెప్పారు. ఈ బకాయిలను ఇప్పించేందుకు ఇరిగేషన్, ఆర్థిక శాఖల మంత్రులతో మాట్లాడతామని, లస్కర్లను తిరిగి నియమిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఇటీవల ఈదురుగాలులు, వర్షాలతో దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈలు దేశానాయక్, రాధాకృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నీటిని పొదుపు చేయాలి



ఒక జిల్లాలో 100 టీఎంసీల నీటి నిల్వ ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా లేదు. ఆ అదృష్టం మనకు దక్కింది. నీరు ఉందని వృథా చేయకుండా పొదుపుగా వాడాలి. చాలా చోట్ల సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. కాబట్టి అవసరమైన మేరకు మాత్రమే నీటిని విడుదల చేయాలి. 2023లో మాదిరి నీరు వృథా చేస్తే సహించేది లేదు. డ్వామా, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షుడు సమన్వయంతో పని చేయాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

### ప్రధాన కాలువల గేట్లు దెబ్బతిన్నాయి



కనిగిరి రిజర్వాయర్ నుంచి లక్ష ఎకరాలకు కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఈ ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువల గేట్లు దెబ్బ తిన్నాయి. వీటికి తాత్కాలికంగా నైనా త్వరగా మరమ్మ తులు చేయాలి. చివరి ఆయకట్టు వరకూ నీరిచ్చేందుకు అధికా రులు కృషి చేయాలి. లస్కర్ల అవసరం ఎంతో ఉంది. వారికి జీతా లిచ్చి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

### నీటి విడుదలకు ముందే పూడిక తీయాలి



నీరు విడుదల చేయకముందే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలి. కావలి కాలువ కెపాసిటీ 900 క్యూసెక్కులు కాగా ప్రస్తుతం 650 క్యూసెక్కులకు మించి ప్రవహించడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన రూ.3 కోట్లతో ఆ కాలువలో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం కింద కాలువలను బాగు చేయాలని నిర్ణయం తీసుకోవడం మంచి ఆలోచన.

- దగ్గుమాటి కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

### సబ్ కాలువలను పునరుద్ధరించాలి



ఉత్తర కాలువ కింద ఉన్న సబ్ కాలువలను గతంలో రాజకీయ కారణాలతో తొలగించారు. ఈ కాలువలను మళ్లీ పునరుద్ధరించాలి. ఉత్తర కాలువ విస్తరణ పనులు చేసేందుకు కాంట్రా క్టర్ ముందుకు రావడం శుభపరిణామం. అయితే ఇక్కడ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు ప్లానింగ్ లేకుండా విస్తరణ జరుగుతోంది. ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాలి. గండి పాలెం రిజర్వాయర్‌లో పనులు చేసేందుకు కనీసం హెడ్‌ఆఫ్‌అకౌంట్ కూడా లేదు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

### 'స్వర్ణముఖి'కి 3 టీఎంసీలు ఇవ్వాలి



తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంక టగిరి నియోజకవర్గాలపై నీటి కేటాయింపుల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలి. తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వడం మంచి నిర్ణయం. స్వర్ణ ముఖి బ్యారేజీకి 2 టీఎంసీలు మాత్రమే ఇచ్చారు. అక్కడి తాగు, సాగు నీటి అవసరాలకు మరో టీఎంసీ నీటిని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

- బల్లి కల్యాణ చక్రవర్తి, ఎమ్మెల్సీ

---

# పేదలకు 'ఉపాధి' చూపరా!?

**3 నెలలుగా కూలి కూడా ఇవ్వడం లేదు**

**జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం**

**సచివాలయ భవనాలు పూర్తి చేసి.. బిల్లులు మంజూరు చేయాలని పట్టు**



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, సభ్యులు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులందరికీ పని దినాలు కల్పిస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయి? అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాలు ఎప్పటికి పూర్తిచేస్తారు? చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా!?' అంటూ పలువురు జడ్పీటీసీ సభ్యులు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులను నిలదీశారు. గురువారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వాడీవేడిగా సాగింది. వాకాడు జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ వాకాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద కుటుంబాలకు చెందిన దాదాపు 200 మందికి ఉపాధి పథకంలో పని దినాలు కల్పించడం లేదని మండిపడ్డారు. చైర్‌పర్సన్ అరుణమ్మ కల్పించుకుని డ్వామా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. దీంతో ఏపీడీవో మాట్లాడుతూ అక్కడ స్థానిక సమస్య ఏర్పడిందని, దానిని పరిష్కరించి అందరికీ పని దినాలు కల్పిస్తామన్నారు. అలాగే కలిగిరి, కలువాయి, మర్రిపాడు, కావలి జడ్పీటీసీ సభ్యులు మల్యాద్రి, అనిల్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవులు మాట్లాడుతూ మూడు నెలలుగా ఉపాధి కూలీలకు కూలి ఇవ్వడం లేదని, ఆ నిధులను వెంటనే మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో సచివాలయ భవనాలు, రైతు సేవా కేంద్ర భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే రూ.19 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, వాటిపైన ప్రభుత్వానికి నివేదికలు పంపి ఉన్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థ ఉందా!? లేదా!? అని జడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటివరకు జరిగిన రోడ్లు, కాలువలు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు చేయక పోవడం, పనులకు సంబంధించి వారు రిపోర్టులు ఇవ్వకపోవడంతో పనులు చేసి ఏళ్లు గడుస్తున్న బిల్లులు మంజూరు కావడం లేదన్నారు. దీంతో చిన్న చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ పనులు జరిగేటప్పుడే క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేయాలి కదా ఆ వ్యవస్థ ఏం చేస్తోందని ఎస్ఈని ప్రశ్నించారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ అశోక్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

---

ఈ నగరానికి

# ఏమైంది!?

- నాలుగు నెలల్లో ఏడు హత్యలు
- వరుస ఘాతుకాలతో ప్రజల బెంబేలు
- చిన్న చిన్న వివాదాలకే దారుణాలు
- నిందితులకు రాజకీయ నేతల అండ?
- ఆపై నిఘా వ్యవస్థ వైఫల్యం
- నేర నియంత్రణలో చేతులెత్తేసిన పోలీసులు

బిడ్డలకు టిఫిన్ తీసుకువస్తానని వెళ్లిన తండ్రి నిమిషాల వ్యవధిలో దారుణహత్యకు గురయ్యాడు. బహిర్భూమికని వెళ్లిన కుమారుడు ప్రత్యర్థుల చేతిలో హతమయ్యాడు. ఇంటికి ఆలస్యంగా వస్తానన్న కుమారుడు మరుసటి రోజు తెల్లవారు జామున మురుగు కాలువలో శవమై తేలాడు.



ఇలా ఇంటిలో నుంచి వెళ్లిన వారు క్షేమంగా తిరిగి వస్తారా!? అన్న నమ్మకం నెల్లూరు నగరంలో సన్నగిల్లు తోంది. చిన్న చిన్న విషయాలు, తగాదాలు దారుణ ఘాతుకాలకు దారితీస్తున్నాయి. నగరంలో ఇటీవల లా అండ్ ఆర్డర్ పూర్తిగా వైఫల్యం కావడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. డ్రోన్ కెమెరాలతో నేర నియంత్రణ చేస్తా మంటున్న రక్షకభటులు అసలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపులను కట్టడి చేయలని నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు. నేర నియంత్రణపై దృష్టి సారించాలని జిల్లా పోలీసుల బాస్ పదేపదే ఆదేశిస్తున్నా యంత్రాంగంలో మాత్రం చలనం ఉండటం లేదు. స్టేషన్లలో పంచాయితీలు, రాజకీయ నాయకుల భజన చేయటంతోనే పోలీసులకు సమయం సరిపోతోందన్న విమర్శలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.


- వివరాలు 8లో..


### ఆర్థిక సమస్యలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

**భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం**

వెంకటాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ భర్త మృతి చెందాడు. వెంకటాచలం మండలం కనుపూరు గ్రామంలో ఈ విషాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కనుపూరులో రాయపనేని రమణయ్య నాయుడు (70), సుబ్బమ్మ (65) దంప తులు నివాసం ఉంటున్నారు. వీరి కుమా రుడు రాయపనేని శేషయ్య బుజబుజ నెల్లూరులో కాపురం ఉంటున్నాడు. అయితే, గురువారం ఉదయం ఎంతసేపటికీ ఇంటిలో నుంచి భార్యాభర్తలు బయటకు రాకపోవడంతో స్థానికులు, బంధువులు అనుమానం వచ్చి పరిశీలించారు. గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న రమణయ్య, సుబ్బమ్మలు హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో రమణయ్య నాయుడు మృతి చెందగా, సుబ్బమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆర్థిక సమస్యల కారణంగానే దంపతులిద్దరూ విషం తాగి నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తప్పిన ఘోరం!

**కల్వర్టును ఢీకొని లోయలోకి కారు బోల్తా ● మంటలు ఎగసిపడి కారు బూడిద**

**నలుగురు యువకులకు తప్పిన ప్రమాదం**



సంగం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నలుగురు యువకులకు త్రుటిలో ప్రాణా పాయం తప్పింది. సంగం - కలిగిరి మా ర్గంలోని సంగంకు 2 కి.మీ దూరంలో బుధవారం అర్ధరాత్రి వేగంగా వస్తున్న ఓ కారు కల్వర్టును ఢీకొట్టి లోయలోకి బోల్తా పడింది. దీంతో కారులో మంటలు ఎగసి పడి పూర్తిగా కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేట మండలం నారాయణరెడ్డిపేట, నవలాకులతోటకు చెందిన క్రాంతికుమార్, అజయ్ కుమార్, రేవంత్ కుమార్, జస్వంత్‌లు బుధవారం నెల్లూరు నుంచి కారులో బయలుదేరి కలిగిరి మండలం పెద్దపాడులో జరిగిన స్నేహితుడి పెళ్లికి హాజరయ్యారు. అనంతరం అర్ధరాత్రి కారులో వస్తూ సంగం సమీపంలో ఉన్న ఆశ్రమం మలుపు వద్ద కల్వర్టును ఢీకొట్టి లోయలోకి బోల్తా పడింది. దీంతో కారు ఆయిల్ ట్యాంకు పగిలి మంటలు రేగాయి. స్వల్ప గాయాలైన క్రాంతి కుమార్ తేరుకుని అజయ్ కుమార్, రేవంత్‌ను కారులో నుంచి బయటకు తీశాడు. వీరిలో ఒకరికి చేయి కాలింది. మరోకరికి తలకు గాయమైయింది. అయితే డ్రైవింగ్ చేస్తున్న జస్వంత్ కారులోనే ఇరుక్కుపోయాడు. ఇంతలో అటువైపుగా మరో వాహనంలో వస్తున్న దినేష్, క్రాంతి కుమార్‌లు జస్వం త్‌ను బయటకు తీశారు. అప్పటికే మంటలవల్ల జస్వంత్‌కు చెయ్యి, కాలికి స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ జహీర్‌ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మకూరు అగ్నిమాపక దళం మంటలను ఆర్పే సమయానికే కారు పూర్తిగా దగ్ధమయ్యింది. గురువారం ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు ఘటనాస్థలిని పరిశీలించారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 119 |
| స్కిన్ చికెన్ | 214 |
| స్కిన్‌లెస్ | 236 |

కోడిగుడ్ల ధర (100): 420

## చిరుధాన్యాల్లో పోషకాలు మెండు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

కలిగిరి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలవారిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగాపాల్గొన్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, సీజనల్ పండ్లు ఆహారంలో చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీవాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై కవిత, ఎం దొరసానమ్మ, సుగుణ రామతులశమ్మ, ఆయా కొండమ్మ, ఆశా విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### న్యూస్ బాక్స్

## నేటి నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొత్తూరులోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం విఘ్నేశ్వరస్వామి, అఖండ పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శనివారం ఉదయం సీతారాముల కల్యాణం, 20న శ్రీరామ పాదుకల పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## చీరల పంపిణీ

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెంలో సీతాసమేత కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం జరిగిన సందర్భంగా గురువారం గ్రామవాసి, టీడీపీ నాయకుడు తానికొండ ఆంజనేయులు కుటుంబసభ్యులు చీరలు పంపిణీ చేశారు. ఎస్టీ కాలనీకి చెందిన యాభైమంది మహిళలకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు దివి తిరుపతినాయుడు, దివి నరసింగరావు, దివి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా ఈకేవైసీ చేయించండి

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డుదారులంతా ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి చెప్పారు. గురువారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీ యూ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఈకేవైసీ పెండింగ్ ఉన్న రేషన్ కార్డుదారులకు డీలర్లు వెంటనే ఈకేవైసీ చేయించాలన్నారు.అలాగే మరణించిన వారి వివరాలు, ఆరేళ్ల లోపు పిల్లల ఈకేవైసీ పెండింగ్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీటీ కే. శ్రీనివాసులు, కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కే. చెంచురామయ్య, ఆర్‌ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తస్రావ రుగ్మతపై అప్రమత్తత అవసరం


డాక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): హీమోఫిలియా అంటే రక్తం గడ్డకట్టే సామర్థ్యం తక్కువగా ఉండే జన్యుపరమైన రుగ్మత అని రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్ వైద్యులు మనోహర్‌బాబు, పామూరు శ్రీధర్ పేర్కొన్నారు. కావలి డేకేర్ సెంటర్‌లో గురువారం ప్రపంచ హీమోఫిలియా నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తస్రావత రుగ్మత ఉన్న వారిలో గాయంఅయినపుడు రక్తస్రావం ఆగటానికి, గడ్డకట్టడానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. ఈ పరిస్థితులలో రక్తంలోని భాగమైన ఫ్రెష్‌ఫ్లోజోన్ ప్లాస్మా ఎక్కిస్తారని వివరించారు. ఈ వ్యాధి ఎక్కువగా పురుషులలో ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ హీమోఫిలియా ఉన్న వారికి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో ఉచితంగా రక్తం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్లు మనోహర్‌బాబు, పీ.శ్రీధర్, రమ్య, స్టాఫ్ నర్సు శేషమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదనరావు, బీఎస్ ప్రసాద్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, గొట్టిపాటి మనోరమ, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు సాయిబాబా గుడివద్ద భక్తులు గురువారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తమండలి ప్రతినిధులు గట్టమనేని సుబ్బారావు, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల వెలుగు కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై సమావేశం జరిగింది. కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య హాజరై ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీపీఎం మునిరత్నం, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వేలంలో పాల్గొనకుండా చేశారు!

ఉలవపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలంలో తాము పాల్గొనకుండా అధికార పార్టీ నాయకులు, దేవదాయశాఖ అధికారులు అడ్డుకున్నారని గోపాలపురం పూర్వ కౌలు రైతులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా ఆలయం ఎదుట డిపాజిట్ కట్టిన స్లిప్పులు చూపిస్తూ నిరసన తెలిపారు. ఇదంతా ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమక్షంలో జరిగిందని వారు వాపోయారు.

# ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం చరిత్రాత్మకం



కందుకూరు : విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు


కావలి : మాట్లాడుతున్న కాకి ప్రసాద్ తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ సీఎం చంద్రబాబు ఆర్డినెన్స్ జారీచేయటం చరిత్రాత్మకమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా వర్గీకరణకు పూర్తిస్థాయి చట్టబద్ధతతో ప్రభుత్వం జీవో జారీచేయటం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఎస్సీలలోని అన్నివర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందాలన్న సంకల్పంతో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం నిరుపేద ఎస్సీల గుండెల్లో ఆయనకు స్థానం కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో దామా మల్లేశ్వరరావు, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, తాటిపర్తి రామకృష్ణ, కావలి ఏసుదాసు, పులి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ● ఎస్సీ వర్గీకరణకు మంత్రివర్గ ఆమోదం హర్షణీయం

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని టీడీపీ ఎస్సీసెల్ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు కాకి ప్రసాద్ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయనతోపాటు టీడీపీ ఎస్సీసెల్ కావలి నియోజకవర్గ అధ్యక్షుడు డీ. దేవకుమార్, పట్టణ అధ్యక్షుడు ఏ. సూర్యప్రకాష్ విలేకరులతో మాట్లాడారు. 2000లో తొలుత వర్గీకరణ చేసిన రామచంద్రరావు కమిషన్, ఉషామెహ్రా కమిషన్‌లు వేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మొత్తం ఎస్సీలను మూడు విభాగాలుగా విభజించి అందరికీ సమన్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకున్నదన్నారు. దీంతో ఎస్సీలలోని 59 కులాలకు సమన్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

### ● ఆర్డినెన్స్ జారీపై కృతజ్ఞతలు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తూ సీఎం చంద్రబాబు ఆర్డినెన్స్ జారీ చేయడంపై నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఏ చినకొండయ్య, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీ. చిన ముసలయ్య కృతజ్ఞతలు తెలిపారు.గురువారం వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీలలోని 59 ఉపకులాలను వర్గీకరించాలని మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారన్నారు.సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో సీఎం చంద్రబాబు ఎస్సీలను వర్గీకరిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

## క్రమశిక్షణ,పట్టుదలకు క్రీడలు దోహదం


క్రికెట్ విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, పట్టుదలకు క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో జరిగిన జూనియర్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ అధ్యతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ ట్రోఫీ అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడలపై దృష్టి పెట్టి, క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ముసునూరు వారియర్స్ జట్టు ఎన్ లెవెన్ లయన్స్ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో ముసునూరు వారియర్స్ విన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చౌదరి, నికిత్ పాల్గొన్నారు.

## 'ఏసు కోసం పరుగు'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పాస్టర్లు శ్యాంసన్‌బాబు, నాగరాజు

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మృత్యుంజయుడు ఏసుక్రీస్తు కోసం పరుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ, పాస్టర్ శ్యాంసన్‌బాబు, కార్యదర్శి రెవ. సీహెచ్.నాగరాజు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ బోగోలు మండల ఐక్యపాస్టర్ల సంఘాలు, పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఏడులోపు ఇబ్రహీంపేట పెట్రోల్ బంక్ వద్ద నుంచి బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం అన్ని సంఘాల్లో క్రీస్తు శిలువ ఉపవాస ప్రార్థనలు ఉంటాయని తెలిపారు. ఆదివారం మరణాన్ని జయించిన మృత్యుంజయుడు ఏసు కోసం ప్రత్యేక ప్రార్థన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఏ.స్టెపెన్, ఎబినేజర్, బీ.రవికుమార్, జీ.రమేష్, పీ.శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం డిపో వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ, ధర్నా చేశారు. యూనియర్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కుందుర్తి వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్క్యులర్ 1-2019ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపాలని, నాలుగేళ్ళుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, మెడికల్ లీవ్‌కు పూర్తి జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి మధుసూదనరావు, ముఖ్య సలహాదారుడు ఎస్‌డివై ఘని, భాస్కర్‌రావు, శ్రీనివాసులతో పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు, మార్కులే జీవితం కాదు


విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న వైద్య నిపుణులు అశోక్

కలిగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా విద్యాలయంలో గురువారం నెల్లూరు డివిజన్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, కావలి ఏఎస్‌పేట, నందిపాడు, మర్రిపాడు,సీతారామపురం కేజీబీవీ కేంద్రాల్లో ఇటీవల 10వతరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు మానసిక ధైర్యం అనే అంశంపై అవగాహన నిర్వహించారు. పరీక్షలు రాసిన విద్యార్థినుల్లో ఫలితాలపై మానసికస్థైర్యం కలిగించడానికి మానసిక వైద్య నిపుణులు పీ అశోక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పరీక్షల్లో సక్సెస్, ఫెయిల్యూర్ సాధారణమని, పరీక్ష ఫలితాలు ఏవిధంగా ఉన్నా వాటిని తమ భవిష్యత్‌కు అనుగుణంగా మలుచుకోవడానికి ప్రయత్నాలు చేసుకొని, ముందుకు సాగిపోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేతు సుప్రియ, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలి


కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటి నుంచి తడిపొడి చెత్త సేకరించేలా ప్రతి గ్రామకార్యదర్శి చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీధర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీలవారీగా రికార్డులను పరిశీలించి, ఇంటి, ఇతర పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండలంలోని బోగోలు, తాళ్లూరు, ఎస్‌జీవీ కండ్రిక, జక్కేపల్లిగూడూరు గ్రామాల్లో ప్రస్తుతం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేపట్టామని తెలిపారు. క్రమంగా ఏబీకండ్రికలోనూ ప్రారంభి స్తామన్నారు. ఇటీవల బోగోలు కార్యదర్శిపై మేరీ అనే మహిళ అధిక బిల్లు వసూలు చేసి తక్కువ బిల్లుకు రసీదు ఇచ్చారని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయమై విచారణకు సిఫారసు చేశామన్నారు. బిల్లులు వసూళ్లలో అవ కతవకలు జరిగితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, డీఎల్ పీవో రాధామాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా పొగాకు కూలీల ప్రయాణం



కలిగిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రెక్కాడితేగాని డొక్కాడని బడుగుజీవులు పొట్టచేతపట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి పొగాకు పనులకోసం మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు వలస వస్తుంటారు. పొగాకు తోటల్లో ఆకురెలిచిన తరువాత కూలీలు వాటిని బ్యారన్ వద్దకు చేర్చి కర్రలకు అల్లి క్యూరింగ్ చేస్తారు. ఈ క్రమంలో రైతులు తమ తోటల్లోని పొగాకును ట్రాక్టర్‌లో లోడ్ చేసి కొని కూలీలను ఎక్కించుకొని బ్యారన్ వద్దకు చేర్చడానికి ప్రయాణం చేస్తారు. ఇలా ట్రాక్టర్ ట్రక్కులో పొగాకు లోడ్ వద్ద ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణం చేయడం జరుగుతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునే వారుండరు.

## పంది చనిపోయి దుర్వాసన పట్టించుకోని అధికారులు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవని జెండా చెట్టు సమీపంలోని ఇళ్ల వెనుక పంది చనిపోయి దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు షేక్ మహ్మద్ బాషా మరికొందరు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పంది చనిపోగా, పంచాయతీ కార్యదర్శి రషీద్‌కు తెలియజేశామని, సాయంత్రంలోపు పందిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని, కానీ తొలగించలేదన్నారు.పందిని తొలగించక పోవడంతో దుర్వాసన భరించలేక పోతున్నామని చెప్పారు.ఈ విషయమై రషీద్ అహమ్మద్‌ను వివరణ కోరగా పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురైందని,శుక్రవారం ఉదయాన్నే తొలగిస్తామని చెప్పారు.

## మంచినీటి బోరుకు రాజకీయ గ్రహణం

### ● ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీ వాసులు


వెంగళాపురం ఎస్సీ కాలనీలో మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

లింగసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీ(కొమ్ము పాలెం)లోని మంచినీటి బోరు మోటారు నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైంది.దీంతో కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బోరుకు కొత్త మోటారు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని కోరారు. ఎస్ఈ ఆదేశాల మేరకు పది రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ బోరును సందర్శించి కొత్త మోటారును ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే పంచాయతీ సర్పంచి వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కొత్త మోటారు కొని బోరుకి బిగించి నీరందిస్తే బిల్లులు చేయనని చెబుతున్నట్టు తెలిసింది.దీంతో అధికారులు ఏమీ చేయలేక పోతున్నట్టు తెలిసింది. ఇప్పటికైనా పాలకులు జోక్యం చేసుకుని మోటారు బిగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## తూతూమంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక ప్రజావేదికలో దస్త్రాలు పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

వలేటివారిపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికను తూతూ మంత్రంగా నిర్వహించారు. సమావేశానికి డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి హాజరయ్యారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. మండలంలో 1216 పనులకు రూ. 14.70 కోట్లు మంజూరు చేశారు. అయితే ఎక్కడా అక్రమాలు జరగలేదనట్లు రూ.2 లక్షలు మాత్రమే రికవరీకి ఆదేశించారు. లింగపాలెం, కళవళ్ల పంచాయతీల్లో పైసా కూడా అక్రమాలు జరగలేదని అధికారులు తెలిపారు. కాగా ప్రజావేదికలో ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు తప్ప జనం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావేదిక ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ జరగాల్సిన ఉండగా మూడు గంటల్లోపే పూర్తి చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఆవులయ్య, ఏపీడీ బాబూరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఏపీవోలు ఉమామహేష్, దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి


అగ్నిప్రమాదాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

కావలి రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకుని, విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జీ. ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాంతి నగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్ ప్రమాదాలతోపాటు ఈత కొట్టడానికి వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించాలన్న దానిపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'టీఆర్‌ఆర్'లో అధ్యాపకులకు సన్మానం


టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ

కందుకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు గ్రూప్ సబ్జెక్టులు, ఒకేషనల్ కోర్సుల్లో నూరుశాతం మార్కులు సాధించేలా కృషిచేసిన అధ్యాపకులను గురువారం సన్మానించారు. ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో గణితం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, ఒకేషనల్ కోర్సుల అధ్యాపకులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సుల్లో తమ విద్యార్థులు నూరుశాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. అధ్యాపకులు ఎంతో నైపుణ్యంతో విద్యాబోధన చేయటంతోపాటు విద్యార్థులపట్ల ప్రత్యేకశ్రద్ధతో వారికి తర్ఫీదునివ్వటం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

కావలిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి) సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ అనుబంధ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పే ఆలోచనను ప్రభుత్వం మానుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. గతంలో ఏజెన్సీల విధానంతో కార్మికులు ఎంత ఇబ్బంది పడ్డారో అందరికీ తెలిసిన విషయమేన్నారు.ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, మధుసూదన్‌రావు, టీ. శీనయ్య, బీ. రమేష్, ఓ. రమేష్, బాబు, బాలయ్య, చిన్నమ్మ, అనిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

# కావలిలో సరికొత్త స్కామ్

- ముస్సిపాలిటీలో ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల పేరుతో వసూళ్లు
- అధికారులమంటూ వేర్వేరు నెంబర్ల నుంచి ఫోన్లు
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు
- వ్యాపారుల వివరాలు బయటకు..
- పురపాలక సంఘం ఉద్యోగులు పనేనా ?

కావలి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కటానికి ఎంతటికైనా కొందరు సిద్ధపడుతున్నారు. ఇళ్లలో కూర్చుని సెల్‌ఫోన్ల ద్వారా ప్రజలను మోసం చేసే వారి సంఖ్య ఎక్కువైంది. ఇటీవల కొందరు వ్యక్తులు 'మీరు లాటరీ గెలిచారు.. మీ బ్యాంకు ఖాతా నిలిచి పోయింది, మీకు రుణం వచ్చింది'... అంటూ ఫోన్లు చేసి ఓటీపీ నెంబర్లు అడిగి వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును కాజేస్తున్న ఘటనల గురించి విన్నాం. అయితే ఈ మోసాలపై ప్రజలను చైతన్యం చేయటంతో ఇప్పుడు అవి చాలా వరకు ఆగిపోయాయి. తాజాగా కావలిలో సరికొత్త మోసానికి కొందరు తెరతీశారు.



కావలి మున్సిపల్ కార్యాలయం

### ● వ్యాపారుల వివరాలు బయటకు..

ఈప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు కావలిలో ఉన్న వ్యాపారులకు ఫోన్లు చేసి ట్రేడ్‌లైసెన్స్ బకాయిలు అడుగుతున్నారంటే వ్యాపారుల వివరాలు వారికి ఎలా తెలిశాయనేది సర్వత్రా చర్చ జరుగుతోంది. ముస్సిపాలిటీలో ప్రస్తుతం కాని, గతంలో కాని పని చేసిన ఉద్యోగులే వారి వివరాలు, వారి ఫోన్ నంబర్లు ఇచ్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముస్సిపాలిటీలో వివరాలు బయటకు వెళ్లతున్నా యనే అనుమానంతో ఇటీవల ఇద్దరు ఆర్‌ఐలను వారి పోస్టుల నుంచి తప్పించి ఇతరులకు బాధ్యతలను అప్పగించారు. అసలు ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిల పేరుతో ఫోన్ కాల్స్ చేస్తున్న ముఠా ఎవరు ? దాని వెనుక ఎలాంటి శక్తులు ఉన్నాయనేది ? ఈ రెండు ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలీసులు సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయి.

### ● ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల వసూళ్ల పేరుతో..

ముస్సిపాలిటీలో ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిల వసూళ్ల పేరుతో సరికొత్త స్కామ్‌కు కొందరు శ్రీకారం చుట్టారు. తాజాగా ఈనెల 13 నుంచి అక్రమ సంపాదన కోసం పట్టణంలోని వ్యాపారులను, కొందరు లక్ష్యంగా చేసుకుని వారికి 63043 26727, 91626 68264 నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తున్నారు. 'మీరు ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిలు ఉన్నారు. వాటిని వెంటనే ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే చేయండి. లేదా మేము పంపే క్యూర్ కోడ్‌కు స్కాన్ చేసి పంపండి'అని అడుగుతున్నారు. దీంతో కొందరు వ్యాపా రులు తాము ఇటీవలే కట్టామని చెబుతుం డగా, వాటి రసీదులను ఫోన్‌పే ద్వారా పంపండని చెబుతున్నారు. ఓ వ్యాపారి రసీదును ఫోన్‌పే ద్వారా ఆ అగంతకులకు పంపగా, దాన్ని ఇతర వ్యాపారులకు పంపి 'మీరు ఫోన్‌పే, క్యూఆర్‌కోడ్ ద్వారా డబ్బులు చెల్లిస్తే, మీకు ఇలాంటి రసీదులు పంపుతామని చెబుతున్నారు.

### ● కమిషనర్ పేరుతో ఫోన్లు

మరి కొంతమంది వ్యాపారులయితే 'మీరు ఎవరు.. ఎక్కడ నుంచి ఫోన్ చేస్తున్నారు' అని అడగ్గా, తాను మున్సిపల్ కమిష నర్ కిరణ్‌ను మాట్లాడుతు న్నానని చెప్పడంతో వ్యాపారులకు అనుమా నాలు వచ్చాయి. కమిష నర్ కిరణ్ ఎప్పుడో బదిలీ కావటం, ఇప్పుడు ఆయన పేరు చెప్పడం, దానికి తోడు భాషలో తేడా ఉండటంతో వ్యాపారులు ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ మున్సిపల్ ఉద్యోగులు ఎవరూ ఫోన్ ద్వారా ట్రేడ్‌లైసెన్స్‌ల బకాయిలు వసూలు చేయటం లేదని, మీరు ఎవరికీ ఫోన్ ద్వారా కాని, క్యూఆర్ కోడ్ ద్వారా కాని చెల్లింపులు చేయవద్దని ఓ ప్రకటన విడుదల చేశారు.

### ● పోలీసులకు ఫిర్యాదు

అంతేకాక మున్సిపల్ రెవెన్యూ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ ద్వారా ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌కు లిఖిత పూర్వకంగా ఈనెల 15న ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా ఒక ఫోన్ నెంబరు హైదరాబాద్ వాసిగా గుర్తించారు. రెండో ఫోన్ నెంబరును ఇంకా గుర్తించే పనిలో ఉన్నారు.



సీఐ ఫిరోజ్‌కు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ (ఫైల్)

# వేణుగోపాలుడి ఆలయ భూముల వేలం

- ఏకపక్షంగా సాగిందని వైసీపీ శ్రేణుల నిష్క్రమణ
- దోపిడీకి విముక్తి లభించిందన్న గోపాలపురం గ్రామస్థులు
- గతం కంటే పెరిగిన ఆదాయం

ఉలవపాడు, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములకు గురువారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. కందుకూరు మండలం మదనగోపాలపురంలో ఆలయానికి చెందిన 172.40 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. మూడేళ్లకు ఒకసారి వేలం నిర్వహించి కౌలుకు ఇస్తుంటారు. గురువారం జరిగిన వేలంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్ర మాన్ని పర్యవేక్షించారు. 48 మంది రైతులు వేలంలో ఆ భూములను దక్కించుకున్నారు. 172.40 ఎకరాలకు ఏడాదికి రూ.18,50,800 చొప్పున మూడేళ్లపాటు ఆలయానికి రూ.55,52,400 ఆదాయం సమకూరనుంది. ఈ ఏడాదికి వచ్చిన కౌలు నగదు ఆలయం పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాలో జమచేయను న్నట్లు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

### ● పెరిగిన ఆదాయం

ఈ భూములకు గత ఏడాది నిర్వహించిన వేలంలో ఆలయానికి వచ్చిన కౌలు రూ.7,78,600 కాగా, గురువారం జరిగిన వేలంలో రూ.10,72,200 ఆదనంగా ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు.

### ● 40 ఏళ్ల దోపిడీకి విముక్తి

ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆలయ భూములను ఎకరాకి రూ.1000 చెల్లించి ఏళ్ల తరబడి స్వామివారికి చెందాల్సిన ఆదాయాన్ని దోచుకుతిన్నారని కౌలు దక్కించుకున్న రైతులు పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా ఆల యానికి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టారని, ఇప్పుడు కూడా ...నేందుకు ప్రయత్నిస్తామని వారన్నారు.

### ● వేసీపీ శ్రేణుల నిష్క్రమణ

పోలీసు బందోబస్తుతో అధికారపార్టీ నాయకులు వేలం ను ఏకపక్షంగా సాగిస్తున్నారని ఆరోపిస్తూ మదనగోపాలపురం గ్రామానికి చెందిన (గతంలో కౌలు సొంతం చేసుకున్నవారు) వైసీపీ శ్రేణులు వేలం నుంచి నిష్క్రమించారు. అధికారపార్టీ చెప్పినట్లు ఆలమ అధికారులు వేలం నిర్వహించి, అన్యాయం చేశారని వారు వాపోయారు. తమకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా పరిష్కరించుకు



వేలం పాటలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

అలాంటి ప్రయత్నాలు కుదరక వేలంను బహిష్కరించి అధికారులపై, అధికారపార్టీపై నిందుల వేస్తున్నారని వారు వివరించారు.

## పేదల గూడుకు
# మోక్షం కలిగేనా ?

జిల్లాలో ఇళ్లులేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. నిధులు దుర్వినియోగమయ్యాయే తప్ప... పేదలకు ఇళ్లు ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఇళ్లపై ప్రత్యేకశ్రద్ధ చూపడం, వచ్చే ఏడాది మార్చిలోపు అసంపూర్తిగా ఉన్న ఇళ్లన్నింటినీ పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టడం, ఈ విషయాలపై ఇటీవల జిల్లాకు వచ్చిన గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి సమీక్ష చేయడం జరిగింది. ఈ క్రమంలో పెండింగ్ ఇళ్ల నిర్మాణాలపై కదలిక వచ్చింది.

- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)



పొదలకూరులో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ ఇళ్లు

- బేస్‌మట్టాలకే పరిమితమైన కాంట్రాక్టర్లు కట్టిన ఇళ్లు
- అత్యధికభాగం నాసిరకమే
- గృహనిర్మాణ మంత్రి సమీక్షతో కదలిక

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని భారీగా నిధులు ఖర్చు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకురాలేని నిరుపేదలకు, కాంట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించింది. జిల్లాలో 29071 ఇళ్లను ఆప్షన్ - 3 ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇందులో ఆత్మకూరు నియోజకవర్గంలో 2092 ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించగా, కేవలం 98 ఇళ్లకు మాత్రమే శ్లాబ్ వేశారు. 68 ఇళ్లు పూర్తి చేశారు. మిగతా ఇళ్లు బేస్‌మట్టం, రూఫ్‌లెవెల్‌లో ఆగిపోయాయి. కందుకూరులో 968 ఇళ్లు కాంట్రాక్టర్లకు అప్పగించగా, 413 ఇళ్లు పూర్తయ్యాయి. మిగతా ఇళ్లు బేస్ మట్టం, రూఫ్‌లెవెల్‌లో నిలిచిపోయాయి. కావలిలో 6,056 ఇళ్లు కేటాయించగా 2020 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కోవూరులో 2506 ఇళ్లకుగాను 642 ఇళ్లు మాత్రమే కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. నెల్లూరు నగరంలో 7407 ఇళ్లకుగాను 1365 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. నెల్లూరు రూరల్‌లో 5896 ఇళ్లకుగాను 1493 ఇళ్లు, సర్వేపల్లిలో 1425 ఇళ్లకుగాను 28 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. వెంకటగిరిలో 625 ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించగా, ఒక ఇంటిని కూడా పూర్తి చేయలేదు. ఉదయగిరిలో 1616 ఇళ్లకుగాను ఏడు ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. దీంతో 29,071 ఇళ్లకుగాను కేవలం 6036 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా, మిగిలిన 23,035 ఇళ్లు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. వీటికి సంబంధించి చేసిన పనుల కంటే కాంట్రాక్టర్లకు బిల్లులు అదనంగా మంజూరు చేసినట్లుగా పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.

### ● మంత్రి సమీక్షతో కదలిక

జిల్లాలో కాంట్రాక్టర్లు చేట్టిన వదిలేసిన ఇళ్లన్నింటిని వారిచేతే పూర్తి చేయించాలని, చేయనిపక్షంలో వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కలెక్టర్, హౌసింగ్ అధికారులకు గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి ఆదేశించారు. అలాగే అసంపూర్తి నిర్మాణాలు ఎక్కువగా నాసిర కంగా ఉన్నాయని, అవి నిర్మాణా లకు పనికి వస్తాయో, లేదో పరిశీలించి అన్నీ ఇళ్లను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో నిలిచి పోయి ఉన్న ఇళ్ల నిర్మాణా లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు.

**నాసిరకం నిర్మాణాలపై చర్చ**

ఇళ్ల నిర్మాణాల బేస్‌మట్టం కేవలం మూడు, నాలుగు అడుగుల్లోనే, ఫిటింగ్‌లు లేకుండా వేసి ఉన్నందున, మరీ నాసిరకంగా ఉన్నందున ఇళ్ల నిర్మాణాలకు ఎంతలోతు బేస్‌మట్టం ఏర్పాటు చేయాలన్నదానిపై హౌసింగ్‌శాఖ పీడీ, పంచాయతీరాజ్ ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు సమావేశమై చర్చించారు. కనీసం ఆరుఅడుగుల మేర బేస్ మట్టం ఉంటేనే నాణ్యతగా ఉంటుందని, వారు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. అలాగే అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై థర్డ్ పార్టీ ద్వారా పరిశీలన చేయించి నాణ్యతగా ఉంటే నిర్మాణాలు కొనసాగించాలని, లేకపోతే వాటిని కూల్చివేసి సదరు కాంట్రాక్టర్లతోనే నిర్మాణాలను పూర్తి చేయించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. దీంతో కాంట్రాక్టర్లతో గతంలో పనిచేసిన హౌసింగ్ ఏఈలు, సచివాలయ సిబ్బంది ద్వారా పిలిపించి పనులు పూర్తి చేయించాలని కూడా నిర్ణయించారు. అందుకు అంగీకరించని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టి వారి నుంచి దుర్వినియోగమైన సొమ్మును రాబట్టి సకాలంలో పనులను పూర్తి చేయించాలన్న ఆలోచనలో పాలకులు, అధికారులు ఉన్నారు. దీంతో ఆగి ఉన్న పేదల ఇళ్లలో మళ్లీ కదలిక మొదలైంది.

## ఓ ప్రైవేటు వైద్యురాలి నిర్వాకం..
# గర్భం పోగొట్టుకున్న మహిళ

- తన సిబ్బందితో ఫోన్ ద్వారా చికిత్స చేయించిన డాక్టర్
- వాడిన మందుల వివరాలు ఇవ్వని వైనం
- గర్భస్రావం కావడంతో బాధితుల లబోదిబో

అల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు వైద్యురాలి నిర్వాకం ఓ మహిళ అమ్మతనాన్ని కోల్పోయేలా చేసింది. ఫోన్‌లో తన సిబ్బంది ద్వారా చికిత్స చేయించిన వైద్యురాలి కారణంగా మూడు నెలల గర్భాన్ని పోగొట్టుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. అల్లూరుకు చెందిన ఓ మహిళ నాలుగేళ్ల క్రితం ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి మరో సంతానం కోసం ఎదురుచూడగా ఇటీవల గర్భం దాల్చింది. మూడో నెల కావడంతో ఈ నెల 15న కడుపులో అసహనంగా ఉండటంతో అల్లూరులోని బాహూజీ పార్కు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. డాక్టర్ లేకపోవడంతో అక్కడున్న సిబ్బంది ఆమెకు గల సమస్యను పరిశీలించి వివరాలను ఫోను ద్వారా వైద్యురాలికి చేరవేశారు. ఆమె సూచనల మేరకు ఓ ఇంజక్షన్‌కు రూ.వెయ్యి, మందులకు రూ.2 వేలు తీసుకొని ఇంజక్షన్ వేసి మందులు ఇచ్చి పంపించారు. ఈ మందులను వాడిన గర్భిణికి అసహనం కాస్త నొప్పిగా మారి బుధవారం అర్థరాత్రి తర్వాత తీవ్ర నొప్పితో భరించలేక అల్లూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడా ఓ ఇంజక్షన్‌తోపాటు మందులు ఇచ్చి తగ్గిపోతుందని పంపించేశారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఏ మందులు వినియోగించారని, సదరు మందుల తాలూకు ప్రిస్క్రిప్షన్ ఇవ్వమని కోరగా అవి లేకుండానే వైద్యం చేశారని బాధితులు తెలపడంతో సదరు వైద్యురాలు గర్భిణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే నొప్పి తీవ్రమై అక్కడే అబార్షన్ అయిపోయింది. దీంతో బాధిత మహిళ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇటువంటి అవగాహన లేని నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళతోపాటు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# ఎస్‌పీఎల్ విజేత రూరల్ లయన్స్

- రన్నరప్‌గా నిలిచిన గూడూరు చాలెంజర్స్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సింహ పురి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీ ఎల్) టీ-20 క్రికెట్ చాంపి యన్‌షిప్ విజేతగా నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు నిలి చింది. బుజబుజ నెల్లూరులోని సీఐపీ క్రీడామైదానంలో గురువారం జరిగిన ఫైనల్‌లో రూరల్ లయన్స్, గూడూరు రాయల్ చాలెంజర్స్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన రూరల్ టీం 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. అనంతరం గూడూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 196 పరుగులు మాత్రమే చేయడంతో 18 పరుగుల తేడాతో లయన్స్ జట్టు కప్పును కైవశం చేసుకుంది. జట్టులోని పూర్ణ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. బహుమతి ప్రదానోత్సవానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి హాజరై విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు అందచేశారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డీ శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కే మునిగి రీష్, టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ కే వంశీకుమార్ తదితరులు పాల్గొన్నారు.




ఎస్‌పీఎల్ ట్రోఫీని అందుకుంటున్న నెల్లూరు రూరల్ లయన్స్ జట్టు

## పొగాకు ధరలు

మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 220 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు. 521 బేళ్ల అమ్మకాలు జరిగాయి.

## రోడ్డుప్రమాదంలో డప్పు కళాకారుడి మృతి

మర్రిపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బాట గ్రామ సమీపంలో 567వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాము లవారి తిరుణాల సందర్భంగా డప్పు కళాకారుడు నల్లిపోగు చిన్నయ్య (58) తమ స్వగ్రామం బాట బీసీ కాలనీలో బుధవారం రాత్రి దేవుని ఊరేగింపులో డప్పు వాయించి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా బద్వేల్ నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో చిన్నయ్య అక్క డికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కృష్ణాపురం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. మర్రి పాడు ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఈ నగరానికి
# ఏమైంది!?

- నాలుగు నెలల్లో ఏడు హత్యలు
- వరుస దారుణాలతో ప్రజల బెంబేలు
- చిన్న చిన్న వివాదాలకే దారుణాలు
- నిందితులకు రాజకీయ నేతల అండ?
- ఆపై నిఘా వ్యవస్థ వైఫల్యం
- నేర నియంత్రణలో చేతులెత్తేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు నిలయమైన నెల్లూరులో వరుస హత్యలు నగర ప్రజలకు కునుకులేకుండా చేస్తోంది. జరిగే హత్యలు కూడా కిరాతకంగా కత్తులతో నరికి, పొడిచి, రక్తం ఏరులై పారేలా విచక్షణా రహితంగా గాయపరిచి చంపుతుండటంతో నగరవాసులు తాము నెల్లూరులో ఉన్నామా!? లేదా నేరాలకు అడ్డాగా మారిన రాష్ట్రాల్లో ఉన్నామా అనే మీమాంశలో ఉండిపోతున్నారు. చిన్న చిన్న కారణాలతోనే హత్యలు జరుగుతుండటం, అధికంగా యువతే ప్రాణాలు కోల్పోవడంతోపాటు హత్య చేసిన వారు యువకులే కావడం చూస్తుంటే యువత ఏ మార్గంలో నడుస్తోందో స్పష్టమవుతోంది.

### ● కత్తులు, మారణాయుధాలతో...

నగరంలో బాలుర నుంచి యువత వరకు బొడ్డుల్లో, వీపు వద్ద, నడుము ఇరువైపులా, జేబుల్లో కత్తులు, మారణాయుదాలు పెట్టుకొని బయటకు రావడం స్టైల్‌గా మారిపోయింది. చిన్న విషయాలకు కూడా కత్తులను బయటకు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. హత్యలు, హత్యాయత్నాలు జరగడంతో బయట వస్తున్న సంఘటనలు తక్కువేనని బయటకు రాని ఘటనలు ఎన్నో ఉన్నాయని పలువురు అంటున్నారు. ఒకప్పుడు నగరంలో ఓ హత్య జరిగింది అంటే జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారేది. ఇప్పుడు రొటీన్ అయిపోయింది. పది రోజులకు ఒక హత్య అన్నట్లుగా నగరంలో వరుస హత్యలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏడు హత్యలు జరిగాయి.

### ● నాయకుల భరోసా

హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడిన నిందితులకు కొందరు రాజకీయ పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఘటన జరిగిన వెంటనే పోలీసుల కంటే ముందే కొందరు నాయకుల అనుచరులు నిందితులను కలిసి 'మీకు బెయిల్ ఇప్పిస్తాము.. పోలీసులకు లొంగిపోయిన వెంటనే దెబ్బ పడకుండా చూసుకుంటాము.' అంటూ వాగ్దానాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసులు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్న వెంటనే నాయకులు ఫోన్లు బేరసారాలకు దిగుతున్నారు. ఇలా రోజుల వ్యవధిలో బెయిల్ వస్తుందన్న భరోసా.. కిరాతకంగా ఓ ప్రాణం తీసినా తనపై చెయ్యి వేసేది ఎవరన్న భయంలేని తనంతోనే నేరాలు పెరుగుతున్నాయని కొందరు పోలీసు అధికారులు, లాయర్లు చెబుతున్నారు.

### ● నిఘా నిద్రపోతోందా!?

నగరంలో రౌడీషీటర్లకు, నేరస్థులకు, చిల్లరవేషాలు వేసే యువతకు పోలీసుల అంటే పూర్తిగా భయం పోయింది. చిన్న చిన్న కారణాలతో కక్షలు పెంచుకొని ఘాతుకాలకు పాల్పడుతున్నారు. వరుస హత్యలు, దొంగతనాలు జరుగుతున్నా పోలీస్ నిఘా ఏమైందన్న ప్రశ్న అందరిలోనూ వ్యక్తమవు తోంది. ఎప్పుడో నెలకోసారి సమీక్షలు, సమావేశాలు జరుపుతున్న పోలీస్ ఉన్నతాధికారులు రాత్రి బీట్లు, తనిఖీల నిర్వహణపై దృష్టి సారించడం లేదు. పాతనేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారు, రౌడీషీటర్లు బయట ఏం చేస్తున్నారు, ఎక్కడకు వెళుతున్నారన్న దానిపై పోలీసులు నిఘా ఉంచలేక పోతున్నారు. రాత్రి పూటగస్తీలు నిర్వహిస్తున్న పోలీసులు సైరన్ వేసుకుంటూ వెళ్లిపోవడం తప్ప ఆ ప్రాంతాల్లో ఎవరు నేరాల బాటలో నడుస్తున్నారు.. ఆయా స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయా!? ఆగంతకులు ఎవరైనా వచ్చారా!? ఉన్న రౌడీషీటర్లు ఏం చేస్తున్నారు? స్థానిక గొడవలు ఏమైనా జరుగుతున్నా!? తదితర అంశాలపై అసలు దృష్టి పెట్టడం లేదు. కత్తులు, మారణాయుధాలను యువకులు వెంటబెట్టుకొని బయటకు వస్తూ నేరాలకు పాల్పడుతున్నా పోలీసులు తనిఖీల్లో ఎవరినీ పట్టుకోలేక పోవడం ఆశ్చర్యపరుస్తోంది.

# టిఫిన్ కోసం హత్య

- అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి ఘాతుకం
- పాతకక్షలతో దాడి చేసి అఘాయిత్యం
- గంట వ్యవధిలో రెండు హత్యలతో కలకలం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : టిఫిన్ సెంటర్‌లో ఆర్డర్ చేసిన టిఫిన్ ముందుగా తనకే ఇవ్వాలనే విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ అందులో ఒకరి హత్యకు దారితీసింది. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అల్లాభక్షు(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అదేవిధంగా పాతకక్షలు మనసులో పెట్టుకుని ఒక వ్యక్తిని కర్రలతో విచక్షణారహితంగా మోది హతమార్చారు. బుధవారం రాత్రి గంట వ్యవధిలోనే జరిగిన ఈ రెండు హత్యలు కలకలం రేపాయి. పోలీసుల సమాచారం మేరకు... వేదాయపాళెంలోని పావని ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో షేక్ అల్లాభక్షు, సుభహాని దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అల్లాభక్షు బుధవారం రాత్రి అయ్యప్పగుడి సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్‌కు వెళ్లి టిఫిన్ ఆర్డర్ చేశారు. అదే సమయంలో రంగనాయకులపేటకు చెందిన షేక్ ఇషాక్ అక్కడికి వచ్చాడు. పార్శిల్ చేసిన టిఫిన్ ముందుగా తనకు ఇవ్వాలని గట్టిగా మాట్లాడటంతో ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఇషాక్ తన వద్ద ఉన్న కత్తితో అల్లాభక్షు ఛాతిపై బలంగా పొడిచాడు. అక్కడే ఉన్న స్థానికులు అతనిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తీవ్రగాయాల పాలైన అల్లాభక్షును బావమరిది రఫి, స్థానికులు కిమ్స్ వైద్యశాలకు తరలించారు. వైదులు చికిత్స చేస్తుండగా అతను మృతిచెందాడు. అల్లాభక్షు భార్య ఫిర్యాదుతో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేశారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఇన్ స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కిమ్స్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమా ర్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు.

**కర్రలతో విచక్షణారహితంగా మోది...**

నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో షేక్ సుల్తాన్(38), షమీమ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. సుల్తాన్‌పై గతంలో హత్యాయత్నం కేసు ఉంది. ఆయన బుధవారం రాత్రి పెన్నానదిలో బహిర్భూమికి వెళ్లారు. అప్పటికే అక్కడ మైపాడుగేటు రాజీవ్ గాంధీకాలనీకి చెందిన పెయింటర్ నాగరాజు, జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ ఖలీమ్ మద్యం సేవిస్తున్నారు. వారికి సుల్తాన్‌తో పాతకక్షలున్నాయి. ఈ నేపథ్యంలో అతనితో గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో కర్రలతో విచక్షణా రహితంగా సుల్తాన్‌పై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో లొంగిపో యినట్లు సమాచారం. సుల్తాన్ తల్లి కరిమున్నీసా ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.